# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 17 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 22 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :17 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 22 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక
- వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు

- మిగతా 2లో



## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..


### మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్

- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు

- మిగతా 2లో

## శబరిమలలో ప్రసాదం కొరత..

### హైకోర్టుకు వెళ్తానన్న మంత్రి




పెన్ పవర్ డెస్క్: సుప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదం కొరతపై కేరళం ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు మధ్య వివాదం ముదిరింది. భక్తులకు సరిపడా

- మిగతా 2లో





## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..

# టీచర్లు వర్సెస్ వైసీపీ..

### తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్

- విజయవాడ శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ నేతల దాడి యత్నం
- తమ నియామకాలు పారదర్శకమని చెప్పేందుకు వచ్చిన టీచర్లు.. అక్రమాలంటూ వైసీపీ నిరసన
- ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరిక
- గురువులపై దాడులను సహించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడికి యత్నించారన్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి చర్యలకు పాల్పడేవారి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. గురువులపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని స్పష్టం చేశారు.

**శాప్ కార్యాలయం వద్ద ఏం జరిగింది?**

మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని, తమ సర్టిఫికెట్లు, సాధించిన పతకాలు అన్నీ నిజమైనవని స్పష్టం చేసేందుకు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ

- మిగతా 2లో

## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

- విజయ్ పాలనపై అప్పుడే మాట్లాడటం సరికాదన్న ప్రకాశ్ రాజ్
- బీజేపీ పతనానికి సమయం ఆసన్నమయిందని వ్యాఖ్య
- తనకు కూడా మోదీనే ప్రధానమంత్రి అన్న ప్రకాశ్ రాజ్

- మిగతా 2లో

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

- మిగతా 2లో

## బంగాళాఖాతంలో వాయుగుండం..

# ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండంగా బలపడే అవకాశం
- రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు కోస్తాంధ్ర జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన
- లోతట్టు ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం




పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న

- మిగతా 2లో



## చైనాకు భారత ఎగుమతులు జోరు..

### 40 శాతం వృద్ధి!

- చైనాకు భారీగా పెరిగిన భారత ఎగుమతులు
- గత ఐదు నెలల్లో దాదాపు 40 శాతం వృద్ధి నమోదు
- ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల
- ఏఐ, డేటా సెంటర్ల వల్లే డిమాండ్ పెరిగిందంటున్న నిపుణులు
- అయినప్పటికీ వాణిజ్య లోటులో పెద్దగా మార్పు లేని వైనం

పెన్ పవర్ డెస్క్:భారత్ నుంచి చైనాకు ఎగుమతులు అనూ హ్యంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్–ఆగస్టు) చైనాకు భారత ఎగుమ తులు సుమారు

- మిగతా 2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

# రంగంలోకి రెవెన్యూ అధికారులు

- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

- మిగతా 2లో



## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు..

# 28 మంది మృతి..!



పెన్ పవర్ డెస్క్:అఫ్గానిస్థాన్‌పై సోమవారం పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 28 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ ప్రకటించగా.. ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గాన్ వెల్లడించింది. గత కొన్ని నెలలుగా

- మిగతా 2లో

## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్



- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

- మిగతా 2లో

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- మొదటి పేజీ తరువాయి
అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు.తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు**

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కుప్పం దేశానికే ఆదర్శం**

"2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగానూ కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## ఎడిటర్ వ్యూ

### డాక్టరమ్మ ఆపరేషన్ సక్సెస్ చేస్తుందా? భీమిలీ నుంచి గట్టెక్కుతారా?

భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా బొత్స అనూష ను నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నియామకంజరిగినట్లు వైసీపీ నుంచి అధికారిక ప్రకటన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. భీమిలీ నియోజకవర్గ ఇన్ ఛార్జిగా... చిన్న శ్రీను పార్టీని వీడటంతో ఆయన స్థానంలో బొత్స అనూషను నియమించాలని జగన్ నిర్ణయించారు. మొన్న బొత్సతో సమావేశమై వన్ టూ వన్ చర్చించిన తర్వాత జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. భీమిలీ నియోజకవర్గం వైసీపీ ఇన్ ఛార్జిగా బొత్స అనూష వ్యవహరించనున్నారు. అయితే బొత్స అనూష ఎంపిక భీమిలి నియోజకవర్గంలో సరైన ఎంపికేనా? అన్న చర్చ జరుగుతుంది. అక్కడ బలమైన టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు ఉన్నారు. అలాంటి చోట రాజకీయ అరంగ్రేట్రం చేస్తున్న బొత్స అనూష ఏ మేరకు విజయం సాధిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీలోనే ఈ రకమైన అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**బొత్స వారసురాలిగా...**

బొత్స అనూష కాపు సామాజికవర్గం నేత కావచ్చు. బొత్స రాజకీయ వారసురాలిగా ఆమె రాజకీయ ఓనమాలు భీమిలి నుంచి నేర్చుకోవాల్సి ఉంది. తొలుత విజయనగరం జడ్పీ ఛైర్మన్ గా బొత్స అనూషను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయితే చిన్న శ్రీను పార్టీ మారిన తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో బొత్స అనూషకు భీమిలీ బాధ్యతలను అప్పగించడం సబబేనా? అన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. తొలుత గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు వంటి పేర్లను పరిశీలించినప్పటికీ వారికంటే కొత్త వారినే ఎంపిక చేయడం మంచిదని జగన్ భావించారు. అయితే భీమిలీలో కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. జనసేన, టీడీపీ కలసి ఉంటే అక్కడ నెగ్గుకు రావడం కష్టమే. ఈ పెను సవాల్ నుంచి ఈ డాక్టర్ బొత్స అనూష ఎలా బయటపడతారన్నది సందేహంగా మారింది.

**మజ్జి శ్రీనివాసరావు నిష్క్రమణతో ...**

ఇప్పటివరకు భీమిలి ఇన్ ఛార్జ్ గా ఉన్న మజ్జి శ్రీనివాసరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ పార్టీ శ్రేణులు చెల్లాచెదురు కాకుండా చూడటానికి జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స కుటుంబానికి పట్టుంది. ఆయనకు వ్యక్తిగతంగా బలముంది. మరొకవైపు సీనియర్ నేత కావడం, కాపు సామాజికవర్గం కావడంతో ఆర్థికంగా, సామాజికవర్గం పరంగా బలంగా కనిపిస్తుంది. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల రాజకీయాల్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి గట్టి పట్టుంది. బొత్స కుటుంబానికి చెందిన వ్యక్తిని ఇక్కడ పెట్టడం వల్ల స్థానిక క్యాడర్ కూడా కదలకుండా పార్టీ వైపే ఉంటుందని అధిష్టానం భావించింది. డాక్టర్ బొత్స అనూష వైద్య విద్యను అభ్యసించి, ఇటీవలే రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు. మహిళా, యువ కోటాలో ఆమెను రంగంలోకి దించడం ద్వారా ప్రతిపక్ష నేత గంటా శ్రీనివాసరావును ఢీకొట్టేందుకు వైసీపీ ఒక కొత్త అస్త్రాన్ని ప్రయోగించినట్లయింది. వాస్తవానికి బొత్స అనూష విజయనగరం జిల్లా పరిషత్ పీఠంపై ఆసక్తి చూపించగా, ఆమెను భీమిలికి పంపడంపై భిన్నమైన విశ్లేషణలు వస్తున్నాయి. అయినప్పటికీ, నియామకం జరిగిన వెంటనే బొత్స అనూష తన తండ్రి బొత్స సత్యనారాయణతో కలిసి స్థానిక క్యాడర్ ను కలుపుకుంటూ భీమిలిలో పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో రంగంలోకి దిగారు. మరి ఈ డాక్టర్ భీమిలిలో వైసీపీని ఎలా ఆపరేషన్ చేస్తారన్నది చూడాలి.

### శబరిమలలో ప్రసాదం కొరత..

- మొదటి పేజీ తరువాయి
ప్రసాదం లేకపోవడంపై కేరళం మంత్రి మురళీధరన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిర్వహణ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అవసరమైతే హైకోర్టుకు వెళ్తానని అన్నారు. ప్రసాదం కొరత ఏర్పడటంతో ఆదివారం పంపిణీని పరిమితం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి యాత్రికుడు ఒక అరవణ పాయసం, మూడు అప్పం ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారు. ప్రసాదం కౌంటర్లను మధ్యాహ్నం 1.30కే మూసేశారు. తిరిగి 5 గంటలకు మళ్లీ తెరిచారు. దీంతో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.ఈ తరహా పరిస్థితులు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ఉండాలంటే.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని మంత్రి మురళీధరన్ అన్నారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తోనూ మాట్లాడి.. విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు చెప్పారు. అయితే, కన్ని నెలలో స్వామిని దర్శించుకునే భక్తుల కోసం దాదాపు 2.6 లక్షల డబ్బాల ప్రసాదాన్ని ముందే సిద్ధం చేసినట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు.గతేడాది కంటే 50 వేల డబ్బాలు అధికంగానే తయారు చేశామని, సీజను ప్రారంభం కాకముందే భక్తుల సంఖ్య పెరిగిపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. సోమవారం నాటికి కేవలం 14 వేల డబ్బాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు చెప్పారు.ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నందువల్లే కొరత ఏర్పడిందని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు చెబుతుండటంపై మంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శబరిమల యాత్ర నేపథ్యంలో.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ముందస్తుగా ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం బోర్డు తెలిపింది.

### కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు.ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత.. టీచర్లు వర్సెస్ వైసీపీ..

- మొదటి పేజీ తరువాయి
గోడు వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు.అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

**వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు**

వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు.సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు.తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు.రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు.

టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు.గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు.ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

**రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (ర్రీఖీ) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు

చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం.. ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- మొదటి పేజీ తరువాయి
అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది.బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది.ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అఫ్ఘానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 28 మంది మృతి..!

- మొదటి పేజీ తరువాయి
ఈ రెండు దేశాల మధ్య జరుగుతోన్న ఘర్షణల్లో ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తాజా వైమానిక దాడులు అఫ్ఘానిస్థాన్‌లోని కునార్, పక్తికా, ఖోస్త్ ప్రావిన్సులను లక్ష్యంగా చేసుకున్నాయని కాబూల్ అధికారులు వెల్లడించారు. దాడుల్లో పలు నివాసాలు ధ్వంసమయ్యాయన్నారు.పాక్ వైమానిక దాడులను తాలిబన్ ప్రధాన ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. రోజురోజుకూ ఇస్లామాబాద్ దురాక్రమణలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఇటీవల పాక్‌లో జరిగిన పలు ఉగ్రదాడులకు ప్రతిస్పందనగా.. అఫ్ఘాన్‌పై దాడులు చేపడతామని ఆ దేశ సమాచార మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే దాడులు చోటుచేసుకున్నాయి.

### స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

కొళత్తూరు నియోజకవర్గంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఊహించని రీతిలో పరాజయం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మార్పును ఆకాంక్షించే ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని చెప్పారు. విజయ్ ప్రభుత్వ పాలనను అప్పుడే విమర్శించడం సరికాదని... కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయాన్నయినా ఇవ్వాలని అన్నారు. ఏడాది పాలన పూర్తయిన తాను స్పందిస్తానని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయిందని... వారి పతన సమయం ఆసన్నమైందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. త్వరలోనే వారి విధానాల తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో రానున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, దీనికి ఏ పార్టీ మద్దతు ఇచ్చినా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ తనకు వ్యక్తిగతంగా ఇష్టం లేదని, ఆయనకు తాను ఓటు వేయకపోయినా... తనకు కూడా ఆయనే ప్రధానమంత్రి అని చెప్పారు. అందుకే ప్రజా సమస్యలపై ఆయనను నిలదీసే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు.

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- మొదటి పేజీ తరువాయి
పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది.వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చైనాకు భారత ఎగుమతులు జోరు.. 40 శాతం వృద్ధి!

- మొదటి పేజీ తరువాయి
40 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు ఇప్పటికీ చైనాకు అనుకూలంగా కొనసాగుతోంది.గత ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మూడు రెట్లు పెరిగి 3.18 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, డిస్‌ప్లే మాడ్యూల్స్ వంటివి వీటిలో ప్రధానమైనవి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు మధ్య కాలంలోనూ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు సైతం 21 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి.అంతర్జాతీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్ల కోసం అత్యాధునిక పరికరాలకు డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. "ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వంతో కూడిన సరఫరా వ్యవస్థలో భారత తయారీ రంగం తన విశ్వసనీయతను చాటుకుంటోంది" అని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మోహింద్రూ పేర్కొన్నారు.

అయితే, ఈ వృద్ధి స్వల్ప స్థాయి నుంచి ప్రారంభమవడంతో చైనాతో నెలకొన్న భారీ వాణిజ్య లోటుపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి భారత్ దిగుమతులు 131.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం భారత ఎగుమతులకు అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

**వనుగుగుమ్మ డొమినిపుట్ కిరోంబో అసరదా గ్రామాలలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు.**

**విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు కృషిచేసిన వైస్ ఎంపీపీ సీర్గం భాగ్యవతి.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 21.**మండలంలోని వనగుమ్మ పంచాయతీ పరిధిలో గల వనుగుగుమ్మ, దోమినిపుట్, కిరోంబో, అసరడా గ్రామాల గత కొన్ని ఏళ్ల నుండి విద్యుత్ స్తంభాలు రంధ్రాలు ఏర్పడి ప్రమాదలకు నిలయంగా తయారయింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో ప్రజలు భయాందోళనకు గురవుతుండేరు. స్తంభాలు మొత్తం తుప్పులు పట్టి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న సమయంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి ఆయా గ్రామాలకు సందర్శించి, సమస్యలు గత నెల ఆగస్టు 27న ఫిర్యాదు చేయడంతో పత్రిక కథనాలు మేరకు విద్యుత్ శాఖ వారు స్పందిస్తూ దొమినిపుట్, కిరంభో, వనుగుమ్మ, ఆసరాడ పలు గ్రామాల కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ సిబ్బందికి, వైస్ ఎంపీపికు ఆయా గ్రామాల వినియోగదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది సాగర్, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు

# విశాఖ రహదారులకు సాంకేతిక భరోసా



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 21 :** విశాఖ నగరంలో రహదారుల నిర్మాణ నాణ్యత, భద్రత, దీర్ఘకాలిక మన్నికను పెంచేందుకు కేంద్ర రహదారి పరిశోధన సంస్థ సీఆర్ఆర్ఐ సాంకేతిక సహకారం అందించనుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రపంచస్థాయి ప్రమా ణాలకు అనుగుణంగా రహదారులను అభివృ ద్ధి చేయాలని విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి భరత్ సూచించారు. బీచ్‌రోడ్డులోని జీవీఎం సీ--స్మార్ట్ సిటీ కార్యాలయంలో సోమవారం ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నేతృత్వంలో సీఆర్ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ చలుమూరి రవి శేఖర్ ఆధ్వర్యంలోని నిపుణుల బృందంతో సమీక్ష సమావేశం జరిగిం ది. నగర రహదారుల నాణ్యత, నిర్మాణ ప్రమా ణాలు, రహదారి భద్రత, పాదచారుల సౌకర్యా లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, కూడళ్ల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పర్యవేక్షణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

రహదారి పనులకు టెండర్లు పిలిచే ముందే సీఆర్ఆర్ఐ వంటి జాతీయస్థాయి సాంకేతిక సంస్థల నిపుణుల సూచనలను తీసుకుని టెండర్ నిబంధనలు, నిర్మాణ ప్రమాణాలను పటిష్టం చేయాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో నాణ్యత, మన్నిక, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నా రు. రహదారుల్లో వినియోగించే నిర్మాణ సామగ్రి నాణ్యత, రహదారి మందం, నిర్మాణ ప్రమాణా లను ఆధునిక సాంకేతిక పద్ధతులతో పర్యవేక్షిం చాలని అన్నారు.రహదారుల అభివృద్ధిలో పాదచారుల బాటలు, మురుగునీటి పారుదల వ్యవస్థ, కూడళ్లు, వీధి మౌలిక వసతులను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని శ్రీభరత్ సూచించారు. విద్యుత్, తాగునీరు తదితర ప్రజా సేవల పనుల కోసం రహదారులను తవ్విన అనంతరం నిర్దేశిత ప్రమాణాల ప్రకారం వాటిని తప్పనిసరిగా పునరుద్ధరించే విధానం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.నగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేగవంతమైన బస్సు రవాణా వ్యవ స్థ, మెట్రో రైలు, విద్యుత్ వాహనాలు, వేగవంత మైన ప్రజా రవాణా వ్యవస్థలకు అనుగుణంగా రహదారి మౌలిక వసతులను అభివృద్ధి చేయా లని ఎంపీ పేర్కొన్నారు.జీవీఎంసీ పరిధిలో వీఎంఆర్డీఏ సహకారంతో ఎనిమిది నియోజక వర్గాల్లో కంకర, రాళ్లతో నిర్మించిన రహదారు లను తారు, సిమెంట్ కాంక్రీట్ ప్రమాణాలకు అభివృద్ధి చేయడంతో పాటు సుమారు 228 కిలోమీటర్ల రహదారులు, 34 కిలోమీటర్ల మధ్య విభజకాలు, 1,550కు పైగా వీధి దీపాలు, పలు కీలక కూడళ్ల అభివృద్ధి పనులు చేపడు తున్న నేపథ్యంలో సీఆర్ఆర్ఐ సాంకేతిక సహ కారం ప్రణాళిక, నాణ్యత, మన్నికను మరింత బలోపేతం చేస్తుందని సమావేశంలో పేర్కొన్నా రు.జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లా డుతూ నగర రహదారుల అభివృద్ధిలో నాణ్య త, భద్రత, దీర్ఘకాలిక మన్నికకు ప్రాధాన్యం ఇస్తూ సీఆర్ఆర్ఐ నిపుణుల సాంకేతిక పరిజ్ఞా నాన్ని వినియోగించుకుంటామని తెలిపారు. నగర పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్య రహదారులను గుర్తించి, శాస్త్రీయ అధ్యయ నాల ఆధారంగా అభివృద్ధి చర్యలు చేపట్టేందు కు సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సీఆర్ఆర్ఐ డైరెక్ట ర్ డాక్టర్ చలుమూరి రవి శేఖర్ మాట్లాడుతూ విశాఖలో మెరుగైన, సురక్షితమైన రహదారి వ్యవస్థ అభివృద్ధికి జీవీఎంసీ, వీఎంఆర్డీఏలతో కలిసి పనిచేసేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నా రు. సమన్వయ అధికారుల నియామకం, సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రాధాన్య రహదారుల గుర్తింపును తదుపరి చర్యలుగా చేపడతామని తెలిపారు. రహదారి, రహదారి భద్రతా తనిఖీలు, పాదచారుల సౌకర్యాల మెరుగుదల, వేగ నియంత్రణ అడ్డంకుల హేతుబద్ధీకరణ, ఆధునిక రహదారి ఆస్తుల నిర్వహణ వ్యవస్థ వంటి అంశాల్లో సాంకేతిక సహకారంపై చర్చించినట్లు చెప్పారు. అంతకు ముందు డాక్టర్ రవి శేఖర్ నేతృత్వంలోని సీఆర్ఆర్ఐ బృందం జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నగరంలోని ఎంపిక చేసిన పలు రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించిం ది. రహదారుల ప్రస్తుత పరిస్థితి, రహదారి భద్రత, కూడళ్లు, సూచిక బోర్డులు, పాదచారుల సౌకర్యాలను బృందం అధ్యయనం చేసింది.విశాఖ రహదారుల సమగ్ర అభివృద్ధికి సీఆర్ ఆర్ఐ,జీవీఎంసీ, సీఆర్ఆర్ఐ--వీఎంఆర్డీఏ మధ్య సాంకేతిక సహకార ఒప్పందాలు కుదు ర్చుకునే అంశంపైనా సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, వీఎంఆర్డీఏ ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, సీఆర్ఆర్ఐ నిపుణులు డాక్టర్ జి. భరత్, డాక్టర్ పి. సంపత్ కుమార్, డాక్టర్ పి.ఎస్. ప్రసాద్, డాక్టర్ కె. రవీం దర్, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ ఇంజనీరింగ్ అధికా రులు, పర్యవేక్షక ఇంజనీర్ శాంతిరాజ్ తదితరు లు పాల్గొన్నారు.

# గోల్డ్ మోడల్ సాధించిన కే సురేష్



ఆల్ ఇండియా లెవెల్ పోటీలో ఎంపికైన సురేష్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 21.**తెలంగాణ రాష్ట్రంలోనీ హైదరాబాద్ లో ఈ నెల 20న జరిగిన కాటేదాన్ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్ ఓపెన్ ఛాంపియన్ 2026 సీనియర్ బ్లాక్ బెల్ట్ మాస్టర్స్ ఫైటింగ్ విభాగంలో కింగ్స్ ఆఫ్ డ్రాగన్ కుంగుపు ఆర్ట్ తరపున ముంచంగిపుట్టు మండలం ఏనుగురై పంచాయతీ బొండపుట్టు గ్రామానికి చెందిన కే. సురేష్ బ్లాక్ బెల్టు మాస్టర్స్ ఫైటింగ్ విభాగంలో తన సత్తా చాటారు. 20 రాష్ట్రాల నుంచి ఈ పోటీలలో సుమారు 5000 పాల్గొనగా 500 మంది ఎంపికయ్యారు. ఈ పోటీలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి కె సురేష్ బ్లాక్ బెల్ట్ మాస్టర్స్ ( ఫైటింగ్ విభాగంలో) పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించి అల్లూరి జిల్లాకు, మండలానికి తన గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకుని వచ్చారు. దీంతో కింగ్స్ ఆఫ్ డ్రాగన్ కుంగుపు మాస్టర్ ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ డైరెక్టర్ ఎగ్జామినర్ బి ఏం ప్రతాప్ సిద్దు సీనియర్ మాస్టర్లు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే ఇండియా లెవెల్ పోటీలకు సురేష్ పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. గోల్డ్ మెడల్ సాధించిన సురేష్ కు అభినందనలు వెల్లువెత్తాయి.

# అల్లూరి యూత్ ఆధ్వర్యంలో అన్నసంతార్పణ



అధిక సంఖ్యలో పాల్గొన్న వివిధ గ్రామాల భక్తులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 21.**మండల కేంద్రంలో వినాయక చవితి పండగ పురస్కరించుకొని అల్లూరి యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం అల్లూరి యూత్ ఆధ్వరంలో అన్న సమారాధన కార్యక్రమానికి మండల కేంద్ర భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు, సరిహద్దు జోలాపుట్టు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు వి వి ఎన్ మూర్తి, ఎం డి సులేమాన్, అల్లూరి యూత్ కమిటీ సభ్యులు ఎస్ గణపతిరాజు, ఎస్ సురేష్, జి ఉదయ్, వి గణేష్, కె శ్యామ్, జె మురళీమోహన్, జి కృష్ణ, ఎస్ శ్రీను, ఏం సత్తిబాబు, శంకర్రావు, షణ్ముఖతో పాటు వర్తకులు వెంకటరావు, నాగరాజు, బిశ్వాస్, చంటి, శ్యామ్, మధుతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అన్న సంతర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కంఠారం పీజీఆర్ ఎస్ గ్రామసభలో 29 దరఖాస్తులు స్వీకరణ...!



పెన్ పవర్

## పెద్దగొందిపల్లిలో వింత వ్యాధి కలకలం

- వారం రోజుల్లో 20 మేకలు మృతి..
- గిరిజన రైతుల్లో ఆందోళన

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**గూడెంకొత్తవీధి మండలంలోని జీకే వీధి పంచాయతీ పరిధి పెద్దగొందిపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యాధి కారణంగా మేకలు వరుసగా మృత్యువాత పడుతున్నాయి. గత కొన్ని రోజులుగా మేకలు ఎలాంటి ఆహారం తీసుకోకుండా తీవ్ర నీరసానికి గురై మృతి చెందుతున్నాయని స్థానిక రైతు సోమేష్ తెలిపారు. గత వారం రోజుల వ్యవధిలోనే గ్రామంలో సుమారు 20 మేకలు మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. మేకలు వరుసగా చనిపోతుండటంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన పశు పెంపకందారులు, రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.వ్యాధి కారణాలు తెలియకపోవడంతో మిగిలిన మేకల పరిస్థితిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి పెద్దగొందిపల్లి గ్రామంలో అత్యవసర పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టి మిగిలిన మేకలను కాపాడడంతో పాటు, ఇప్పటికే నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పశుపెంపకందారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

epaper.penpower.in | 2026-09-21 | Page: 4
For more details, visit epaper.penpower.in



**ఎంపీడీవో జీడివి ప్రసాద్ వెల్లడి.**

**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 21:** గ్రామాల్లో ప్రజలు, రైతులు నేరుగా తెలియజేసిన రెవెన్యూ, అభివృద్ధి సమస్యల పరిష్కారమై సత్వర చర్యలు తీసుకోనేందుకు సంబధిత శాఖ అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో జీవిడి ప్రసాద్ తహసీల్దార్ ప్రసాదరావు లు తెలిపారు. పీజీఆర్ ఎస్ ప్రజా సమస్యల పరిష్కారవేదిక (గ్రీవెన్స్) లో భాగంగా కొయ్యూరు మండలంలోని కంటారం లో సోమవారం ఎంపీడీవో ప్రసాద్ తహసిల్దార్ ప్రసాదరావు, మండల ఇంజినీరింగ్ అధికారి సి హెచ్ రామకృష్ణ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ నుంచి 29 వినతులు అందినట్టు ఎంపీడీవో తెలిపారు.వీటిలో రెవిన్యూ శాఖ కు 28 , పి ఆర్ ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ కు ఒక వినతి పత్రం అందినట్టు తెలిపారు. వీటిపై సమీక్షా చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబధిత శాఖ అధికారులకు ఆదేశించినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.ఈ పీజీఆర్ ఎస్ సమావేశానికి జె ఈ ఈ రామకృష్ణ, ఐసిడిఎస్ పి ఓ దేవమణి, వ్యవసాయ, రెవిన్యూ, ఇతర శాఖల అధికారులు స్థానిక ప్రజా బీజేపీ, టీడీపీ, వైసిపి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# విశాఖ మేయర్ పీఠానికి సరైన నేత - ప్రజల్లో, పార్టీలో బలమైన పేరు ఒమ్మి సన్యాసిరావు

- మూడు దశాబ్దాల నమ్మకం.. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకుడు
- యాదవ సామాజిక వర్గం మద్దతు.. నగర అభివృద్ధికి సిద్ధమైన నాయకత్వం



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే వెలగపూడి తో ఒమ్మి సన్యాసిరావు (ఫైల్ ఫోటో)

**విశాఖపట్నం, పెన్ పవర్ సెప్టెంబర్ 21**: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) 2026 ఎన్నికలు సమీపిస్తున్న వేళ మేయర్ అభ్యర్థి ఎవరనే చర్చ టీడీపీ శ్రేణుల్లో జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో పార్టీకి, ప్రజలకు ఇద్దరికీ ఆమోదయోగ్యమైన పేరుగా ఒమ్మి సన్యాసిరావు తెరపైకి వచ్చారు.పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎందరో నేతలు పార్టీ మారినా, మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా, వెన్నెముకగా నిలిచారు. పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను - రాష్ట్ర, జిల్లా, నగర స్థాయి పదవులు, ఎన్నికల నిర్వహణ బాధ్యతలు - సమర్థవంతంగా నిర్వర్తించిన అనుభవం ఆయన సొంతం.

### ప్రజల్లో బలం.. పాలనలో అనుభవం

2007లో జీవీఎంసీ ఏర్పడిన తర్వాత 2వ వార్డు (తూర్పు నియోజకవర్గం) నుండి టీడీపీ తరపున కార్పొరేటర్ గా ఘన విజయం సాధించారు. తోటగరువు ఉన్నత పాఠశాల అభివృద్ధి, సూర్యతేజా నగర్, రాజీవ్ ఆవాస్ యోజనపై క్రింద మురికివాడు అభివృద్ధి గృహ సముదాయాలు, జె ఎన్ ఎన్ యు ఆర్ ఎం గృహాల నిర్మాణం, బి ఆర్ టి ఎస్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంతో శ్రీకాంత్ నగర్ ఏర్పాటు - తోటగరువు గ్రామాల అభివృద్ధి కోసం, త్రాగునీటి సమస్యలపై అనేక ఉద్యమాలు చేసి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గం నుండి పార్టీకి మద్దతు కూడగట్టడంలో ఆయన పాత్ర కీలకమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నేడు నగర, జిల్లా స్థాయిలో ఆ సామాజిక వర్గానికి బలమైన నాయకుడిగా ఎదిగారు.

### సేవకు సిద్ధం

ఈ సందర్భంగా ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ "ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలంగా ఉన్నాను. నగర ప్రజలకు సేవ చేసేందుకు మేయర్ గా అవకాశం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నాను. మూడు దశాబ్దాల విధేయతకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నాను" అని అన్నారు.

అన్ని అర్హతలు, అనుభవం, సామాజిక బలం ఉన్న ఇలాంటి నాయకుడిని మేయర్ అభ్యర్థిగా నిలబెడితే, విశాఖ నగరంలో పార్టీ మరింత బలపడుతుందని టీడీపీ క్యాడర్ బలంగా కోరుకుంటోంది.

## కన్నుల పండుగగా రామాలయం గణనాథుని శోభాయాత్ర.

- అంబరాన్నంటిన యువత సంబరాలు.
- నృత్యాలతో ఆకట్టుకున్న మహిళలు, చిన్నారులు.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 21.** చింతపల్లి మండల కేంద్రంలోని రామాలయం వీధిలో కొలువైన వినాయకుని శోభాయాత్ర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. చవితి రోజు నుంచి భక్తుల విశేష పూజలందుకున్న బొజ్జ గణపయ్యను గంగమ్మ ఒడికి చేర్చేందుకు పురవీధుల గుండా సాగిన ఈ ప్రస్థానం ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. రామాలయం వీధి 'వినాయక యూత్ కమిటీ' ఆధ్వర్యంలో ఈ నిమజ్జనోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనంపై ఆశీనుడైన విఘ్నేశ్వరుడిని దర్శించుకునేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శోభాయాత్ర పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు అంబరాన్నంటాయి. డీజే చప్పుళ్లు, కోలాటాలు, యువత తీన్మార్ నృత్యాలతో రామాలయం వీధి మార్మోగింది. ముఖ్యంగా చిన్న, పెద్ద, ఆడ, మగ అనే తారతమ్యం లేకుండా మహిళలు, యువకులు, చిన్నారులు గణపతిపై తమకున్న భక్తిని చాటుతూ చేసిన నృత్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తిభావం, ఆనందోత్సాహాల నడుమ వీధులన్నీ కోలాహలంగా మారాయి. భారీ జనసందోహం నడుమ సాగిన ఈ శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టి, యాత్ర సాగే మార్గాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు. పోలీసుల సహకారం, భక్తుల భక్తిప్రపత్తుల నడుమ ఈ శోభాయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. వేడుకను అద్భుతంగా నిర్వహించడం పట్ల నిర్వాహకులు, యూత్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## జీవీఎంసీ 100వ వార్డు కార్పొరేటర్ ఎన్నికలకు పోటీకి సిద్ధం - నల్లూరు



**కూర్మన్న పాలెం:పెన్ పవర్,సెప్టెంబర్21**
జీవీఎంసీ 100వ వార్డు కార్పొరేటర్‌గా తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసేందుకు తనకు టికెట్ కేటాయించాలని వార్డు, పాత 86వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లూరు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి వార్డు ప్రజా సమస్యలపై పనిచేస్తూ, స్థానిక ప్రజలను చైతన్య పరుస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు.ప్రతిపక్షంలో ప్రజల తరఫున పలు కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశానన్నారు .పార్టీ 100వ వార్డు కార్పొరేటర్ టికెట్ తనకు కేటాయిస్తే ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అవకాశం కల్పిస్తే వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతానని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## వినాయకుని ఊరేగింపు అంగరంగ వైభోగమే.

- హుకుంపేట శతకం పట్టు వీధి నిమజ్జనం కన్నుల పండగ



**హుకుంపేట సెప్టెంబర్ 21 పెన్ పవర్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రం శతకం పట్టు వీధి కొలువైన వినాయకుడికి భారీ ఊరికింపు మరియు నిమజ్జనం నిర్వహించారు వినాయకుడు కొలువైన ప్రతిరోజు గ్రామంలో ప్రతి ఒక్కరి కోసం పూజలు నిర్వహించిన భక్తులు గ్రామం శాంతియుతంగా ఉండాలని సుఖ సంతోషంగా ప్రజలందరూ ఉండాలని మండప నిర్వహకులు ప్రతిరోజు పూజలు నిర్వహించమని తెలిపారు అంతేకాకుండా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఏడు రోజులు వినాయకుని పూజలు నిర్వహించారు పంటలు సక్రమంగా అందాలని వాతావరణం రైతులకు అనుకూలించాలని ఆ విగ్నేశ్వరుని ప్రార్థించమని వారు అన్నారు అనంతరం ఊరేగింపు నిర్వహించారు ఈయొక్క కార్యక్రమంలో పోలీస్ అధికారులు అవాంఛనీయ కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు ఇందులో భాగంగా హుకుంపేట మాజీ సర్పంచ్ సమ్మిడ.వెంకట పూర్ణిమ, అరకు అసెంబ్లీ ఐటీడీపి అధ్యక్షులు జన్ని.వెంకటరమణ, గ్రామస్తులు కాసుల. కృష్ణ, గోవింద్, రవణ, సుధాకర్, బద్నేని.నూకరాజు, శివ బాలు,ప్రభాకర్,తుఫాన్, జగదీష్, పండు శివాజీ లవకుశ, రేగం.భాస్కరరావు,లోవరాజు, గౌతమ్, పూర్ణ, రాజా, హరి, పొండోయ్.వెంకట్ చుట్టుపక్కల గ్రామస్తులు ఆడపడుచులు యువత తదితరులు భారీగా పాల్గొన్నారు

## విశాఖ విమల విద్యాలయం పాఠశాలను ప్రభుత్వం పాఠశాల గా చేయాలని వినతి

- విద్యార్థులు భవిష్యత్తు కాపాడాలని ఎంఎల్ ఏను కోరిన ఉపాధ్యాయులు
- తప్పకుండా తనవంతు సహాయం చేస్తామన్న పల్లా



**గాజువాక :పెన్ పవర్,సెప్టెంబర్ 21 :** పారిశ్రామిక ప్రాంతం పెదగంట్యాడ విశాఖ విమల విద్యాలయం పాఠశాలను ప్రభుత్వ పాఠశాలగా మార్చాలని స్థానిక గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ని, గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉపాధ్యాయులు కలిసి వినతిపత్రం అందజేశారు .

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా తో ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో ఉన్న మా పాఠశాలలో నిర్వాసిత ప్రాంత పిల్లలు, కాంట్రాక్టు కార్మికులు పిల్లలు చదువుతున్నారని, ప్రస్తుతం విద్యార్థులు ఫీజులు కూడా కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, సుమారు 13 ఎకరాల స్థలంలో క్రీడా మైదానం, తరగతి గదులు, విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు కలిగిన, ప్రశాంతమైన వాతావరణం ఉన్న ఈ పాఠశాలను, ప్రభుత్వపరం చేసేలా మీరు కృషి చేయాలని విద్యార్థులు భవిష్యత్తు కోసం ఆలోచన చేయాలని కోరారు. పల్లా గారు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారికి ఈ సమస్యను తెలియజేస్తానని, మీరు ధైర్యంగా ఉండండి అని, విద్యార్థిని విద్యార్థులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధునాయుడు, జ్యోతి, విజయలక్ష్మి, స్వర్ణలత, భాస్కర్, నిరీక్షణ, రమణ , బోధేనతర సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు రోజులుగా అంధకారంలో మగ్గుతున్న కోరుకొండ.

**రాత్రివేళ కొవ్వొత్తుల వెలుగులోనే అత్యవసర వైద్య సేవలు.**



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 21.** మండలంలోని బలపం పంచాయితీ కోరుకొండలో గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేక పంచాయతీ ప్రజలు అంధకారంలో గడుపుతున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రజలు ఆసుపత్రి సిబ్బంది మాట్లాడుతూ విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రాముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అలాగే గ్రామ సచివాలయం అంధకారంలో మగ్గుతున్నాయన్నారు. మరీ ముఖ్యంగా ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు అప్పుడే పుట్టిన పిల్లలకు వేసే టీకా మందులు భద్రపరిచే కూలింగ్ పరికరాలు విద్యుత్ సరఫరా లేకపోవడం వలన వేలాది రూపాయల విలువచేసే మందులు పాడైపోతున్నాయన్నారు. వైద్యం చేయడానికి కూడా కొవ్వొత్తుల వెలుగులు వైద్యాన్ని అందించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. చీకటిలో సంచరించడం వలన కుక్కలు మనుషులపై దాడి చేస్తున్నాయన్నారు. అలాగే సచివాలయంలో కూడా పనులు విద్యుత్ సరఫరా లేక అంతరాయంతో ఆగిపోతున్నాయి అన్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు సమస్యను గుర్తించి విద్యుత్ సరఫరా చేయాలని పంచాయతీ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది,రోగులు కోరుతున్నారు.

## పాడేరులో 23న టీడీపీ విస్తృత కమిటీ సమావేశం




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత కమిటీ సమావేశంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థులపై సమావేశం నిర్వహించనున్నట్లు గూడెంకొత్తవీధి మండల టీడీపీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ పసుపులేటి నాగమణి తెలిపారు.ఈ సమావేశం ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు పాడేరు పట్టణంలోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.సమావేశానికి గూడెంకొత్తవీధి మండల టీడీపీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, మండల క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండలంలోని 16 పంచాయతీల బూత్ యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సహకార బ్యాంకు చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, నీటి సంఘాలు, దేవదాయ శాఖ సంఘాల చైర్మన్లు తదితరులు హాజరు కావాలని వారు కోరారు.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలతో పాటు పార్టీ విస్తృత కమిటీ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత నాయకులు, కార్యకర్తలు నిర్ణీత సమయానికి హాజరు కావాలని టీడీపీ మండల నాయకులు విజ్ఞప్తి చేశారు.

## నూతన తరగతి గదులను ప్రారంభించిన ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య.

**అధికారంలో ఉన్నా లేకున్నా అభివృద్ధి చేయడంలోనే ముందడుగు.**



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 21.** మండలంలోని పెదబరడ పంచాయతీ, కృష్ణాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన రెండు తరగతి గదులను ఎంపీపీ కోరాడు అనూష దేవి, జడ్పిటిసి పోదురాజు బాలయ్య ప్రారంభించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితం పాఠశాలను సందర్శించడం జరిగిందన్నారు. ఈ పాఠశాలకు సుమారు 220 మంది విద్యార్థులు వచ్చి విద్యను అభ్యసిస్తున్నారని, పాఠశాలలో విద్యార్థులకు సరిపడే తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తమ దృష్టికి తీసుకు వచ్చాడు అన్నారు. దీనిపై స్పందించి అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించినప్పటికీ అనతి కాలంలోనే ఆయన బదిలీపై వెళ్లడంతో తరగతి గదులు నిర్మాణం కార్యరూపం దాల్చలేదు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జెడ్పి, ఎంపీపి నిధుల నుండి రెండు లక్షల రూపాయలను తరగతి గదులు నిర్మాణానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతోపాటు విద్యా కమిటీ చైర్మన్ మరియు గ్రామస్తులు ఉపాధ్యాయుల సహకారంతో రెండు తరగతి గదులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తరగతి గదులను ప్రారంభించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. తాము అధికారంలో ఉన్నా లేకున్నా పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమ వైసిపి పాలనలు విద్యపైనే దృష్టి పెట్టడం జరిగిందన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు వైసీపీ ప్రభుత్వంలో జరిగాయన్నారు. విద్యా కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రెండు తరగతి గదులు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీపీ జడ్పిటిసి లకు 20 గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కొంతమేరకు తరగతి గదులు అందుబాటులోకి రావడం వలన ఉపాధ్యాయులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పీబీవీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు వంతల చంద్రబాబు, తాజా మాజీ సర్పంచ్ సమిడి గోపాల్, విద్యా కమిటీ అధ్యక్షులు ఆనంద్, మాజీ మండల అధ్యక్షులు ఉల్లి లక్ష్మయ్య పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్లెక్సీలు చించివేతపై పోలీసులకు ఫిర్యాదు

**జి.మాడుగుల.పెన్ పవర్. సెప్టెంబర్ (21)** వినాయక చవితి దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన శుభాకాంక్షల ప్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడంపై పోలీసులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రముఖ మత్స్యరాస.మత్స్యరాజు కోరారు. జి.మాడుగుల మండలంలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి దసరా శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన బ్యానర్లలో తమ ఫొటోలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 19న రాత్రి జి.ఎం.కొత్తూరు కూడలిలో ఏర్పాటు చేసిన బ్యానర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారని చెప్పారు. అలాగే 17వ తేదీన వినాయక చవితి సందర్భంగా భక్తులకు నిర్వహించిన అన్నసమారాధనకు సంబంధించిన నాలుగు అండలను కూడా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని తెలిపారు. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు విచారణ జరిపి ఘటనలకు పాల్పడిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని మత్స్యరాస మత్స్యరాజు కోరారు.

## గురజాడ అప్పారావు 164 జయంతి పురస్కరించుకొని నివాళులు



**గాజువాక :పెన్ పవర్ ,సెప్టెంబర్21**
సమాజ చైతన్యానికి మహాకవి గురజాడ అప్పారావు ఎనలేని కృషి చేశారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురజాడ అప్పారావు 164 జయంతి పురస్కరించుకొని ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ. గురజాడ జయంతిని ఆధునిక తెలుగు సాహిత్య దినోత్సవం గా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు ఇచ్చిందని , గురజాడ అప్పారావు రచించిన కథలు ,పద్యాలు ప్రజల్లోకి చైతన్యాన్ని తీసుకు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురజాడ సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ సాహితీవేత్త, సామాజిక సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' నాటకం తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. అలాగే గురజాడ రచించిన దేశభక్తి గేయాలు ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించాయని పేర్కొన్నారు. తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా వ్యవహారిక భాష కోసం గురజాడ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస పాథూర్, ఐక్యూఏసీ సమన్వయకర్త, ఆంగ్ల విభాగాధిపతి కోటేశ్వరరావు తదితరులు గురజాడ అప్పారావు సాహిత్య, సామాజిక సేవలను వివరించారు.తెలుగు విభాగాధిపతి శ్రీ ప్రసాద్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు అభ్యుదయ భావాలు, రచనలు, సామాజిక సంస్కరణల కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి కూడా ఎంతో అవసరమని అన్నారు. సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో గురజాడ సాహిత్యం కీలక పాత్ర పోషించిందని తెలిపారు.గురజాడ అప్పారావు రచనలు, ఆలోచనలు నేటి తరానికి అవసరమా అనే అంశంపై కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.అనంతరం బీఏ ప్రత్యేక తెలుగు విద్యార్థులు 'కన్యాశుల్కం' నాటకాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. నాటకంలోని సామాజిక సందేశాన్ని విద్యార్థులు తమ నటన ద్వారా చక్కగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు, ఇతర విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# వర్షాభావానికి విరుగుడు 'విత్తన గుళికలు'



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**మారుతున్న వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితుల్లో పంటలను, విత్తనాలను సంరక్షించుకునేందుకు 'విత్తన గుళికల' సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని మండల వ్యవసాయ అధికారి సురేష్ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఏబులంలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి రవీంద్రపాత్రుడు పాల్గొని రైతులకు విత్తన గుళికల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు.విత్తన గుళికల తయారీకి బీజామృతం, బంకమట్టి పొడి, ఘనజీవామృతం పొడి, పొయ్యి బూడిద అవసరమని రవీంద్రపాత్రుడు తెలిపారు. ముందుగా విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేయాలి. అనంతరం గోనె సంచీ సహాయంతో విత్తనాలకు మొదటి పొరగా బంకమట్టి పొడి అంటుకునేలా చేసి అటు ఇటు తిప్పాలి. ఆ తర్వాత రెండో పొరగా ఘనజీవామృతం పొడి, మూడో పొరగా పొయ్యి బూడిదను దట్టించి గుళికలుగా తయారు చేసుకోవాలని వివరించారు.ఇలా తయారు చేసిన విత్తన గుళికలను భూమిలో విత్తడం వల్ల వర్షాలు ఆలస్యమైనా లేదా తక్కువగా పడినా విత్తనం పాడైపోకుండా రక్షణ కలుగుతుందని అధికారులు తెలిపారు. వర్షపు తడి తగిలిన వెంటనే గుళికలోని విత్తనం మొలకెత్తేలా ఈ పద్ధతి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు విత్తన గుళికల సాంకేతికతను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రేజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన



**గాజువాక :పెన్ పవర్,సెప్టెంబర్ 21** జీవీఎంసీ 66 వార్డులో శ్రీ సిద్ధి వినాయక పూజ మహోత్సవం సందర్భంగా 66వ వార్డులో శివాజీ నగర్ యూత్ మరియు కైలాష్ నగర్ నందు వినాయక నగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కణితి రోడ్డు నందు రేజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పాల్గొని ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక హౌస్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు భాష్యం త్రినాథ్, ,ఎమ్మెస్ అప్పారావు , శంకర్ రావు , గంటా నారాయణరావు, పొన్నాడ రమణ, డాక్టర్ జగన్మోహన్ వేణు , మాజీ కౌన్సిలర్ రెడ్డి జగన్నాథం, స్వర్ణపుడి సత్యనారాయణ, గణేష్ ,నగేష్ కణి తి రోడ్ లో గల రేజింగ్ స్టార్ యూత్ సంతోష్ హేమంత్ చిన్న సురేష్ రెడ్డి గణేష్ ఈశ్వరరావు మరియు వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా గణనాథుడు నిమజ్జ న వేడుకలు

చింతలపూడి లో చూపరులను ఆకట్టుకున్న గణేష్ మహిళా కమిటీ కోలాటం



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 21:**బొజ్జ గణపయ్య నిమజ్జన వేడుకలు కొయ్యూరు మండలం చింతలపూడిలో అత్యంత వైభవంగా సోమవారం నిర్వహించారు. గణనాథుడికి గత వారం రోజుల నుండి ప్రత్యేక పూజలు తో అన్న సమారాధన నిర్వహించారు, గ్రామమంతా ఏకతాటిపై వచ్చి ఒకే ఒక గణనాథుని గ్రామంలో ప్రతిష్టించడంతో పలువురికి ఆదర్శంగా నిలిచారు. నిమజ్జన వేడుకలో సోమవారం మహిళలు, చిన్నారులు యువత, ఆధ్వర్యంలో మహిళలు కోలాటాలు, చిన్నారుల నృత్యాలు,తో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గింజర్తి చెరువులో గణనాథుడిని నిమజ్జనం చేపట్టారు.ముందుగా వేలంపాట నిర్వహించడం తో గణనాథుడు లడ్డు ను చింతలపూడి గ్రామానికి చెందిన ధన్యం రాజు కనకరాజు ఐదు వేలుకు లడ్డూను దక్కించుకున్నారు అయితే ఈ ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా యువత ప్రత్యేక చొరవ తీసుకోవడంతో నిమజ్జనం ప్రశాంతంగా ఆహ్లాదకరంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు

# రహదారి మొత్తం 12 కిలోమీటర్లు.

- పది కిలోమీటర్ల దూరం వరకు నరకాన్ని చూస్తున్న ప్రాంతవాసులు.
- పెచ్చులుగా ఊడిన తారు.అడుగడుగునా భారీ గుంతలు
- అత్యవసర వేళల్లో అంబులెన్సులకూ తప్పని తిప్పలు.
- చౌడుపల్లి కొత్త పాలెం ఘాట్ రోడ్డుకు తక్షణమే తారు రోడ్డు వేయాలి.
- గిరిజన సంఘం డిమాండ్.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 21.** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం,చౌడుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చింతపల్లి--జెర్రిల రహదారి అధ్వానంగా మారడంతో గిరిజనులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఉన్నారని గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సుమారు 12 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిలో చౌడుపల్లి నుంచి కొత్తపాలెం ఘాట్ వరకు దాదాపు 10 కిలోమీటర్ల రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.సుమారు 15ఏళ్ల క్రితం నిర్మించిన తారు రోడ్డు నాణ్యత లేకపోవడంతో పలుచోట్ల తారు పెచ్చులుగా ఊడిపోయి, భారీ గుంతలు ఏర్పడ్డాయి అన్నారు. వర్షాలు కురిసినప్పుడు ఆ గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని,రోడ్డు ఎక్కడుందో, గుంత ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.బస్సు రూట్ మార్చేంత దుస్థితి వచ్చిందని

గతంలో చింతపల్లి నుంచి మొండిగడ్డ వరకు బస్సులు చౌడుపల్లి మీదుగా రాకపోకలు సాగించేవని అన్నారు. అయితే రహదారి పూర్తిగా పాడవడంతో నర్సీపట్నం నుంచి వచ్చే డిపో బస్సును చౌడుపల్లి మార్గంలో కాకుండా రింతాముళ్ల మెట్ట, కొత్తపాలెం మీదుగా జెర్రిల, మొండిగడ్డ వైపు మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.చౌడుపల్లి నుంచి కొత్తపాలెం వరకు రహదారి దుస్థితి కారణంగా ఈ ప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న రు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలన్నా, కాలినడకన వెళ్లాలన్నా గుంతలు, బురద, నీటితో అవస్థలు తప్పడం లేదని స్థానికులు పోతున్నారన్నారు.

**అత్యవసర వేళల్లో ప్రాణాలతో చెలగాటం.**

రోడ్డు దుస్థితి కారణంగా అత్యవసర వైద్య పరిస్థితుల్లో గర్భిణులు, అనారోగ్యంతో తీవ్రంగా బాధపడుతున్న రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంబులెన్స్‌లు సైతం ఈ రహదారిపై వెళ్లాల్సి రావడంతో అత్యవసర వైద్య సేవలకు ఆటంకం ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, గర్భిణీ స్త్రీలను ఈ రహదారి గుండా తీసుకురావడం అత్యంత క్లిష్ట సమస్యగా మారిందన్నారు.

రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండటంతో కొంతమంది ప్రయాణికులు ఈ మార్గంలో వెళ్లలేక ఇతర మార్గాల ద్వారా చుట్టూ తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తోందని తెలిపారు.

**మట్టితో కప్పిన మరలా మొదటికి వచ్చిన దుస్థితి.**

తీవ్రమైన పరిస్థితుల్లో కొంత ఉపశమనం కల్పించేందుకు ఆర్అండ్‌బీ రహదారి అయినప్పటికీ పంచాయతీ నిధుల నుంచి కొంత మొత్తాన్ని కేటాయించి గుంతల్లో మట్టి పోశారని స్థానికులు చెబుతున్నారని అయితే ఆ తాత్కాలిక చర్యకు నెల రోజులు కూడా గడవకముందే మళ్లీ గుంతలు ఏర్పడి పరిస్థితి యథాతథంగా మారిందని పేర్కొన్నారు.

"గుంతల్లో మట్టి పోయడం శాశ్వత పరిష్కారం కాదని పూర్తిస్థాయిలో తారు రోడ్డు నిర్మించాల్సిందే" అని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు.

**10 కిలోమీటర్ల తారు రోడ్డుకు తక్షణమే నిధులు మంజూరు చేయాలి.**

చౌడుపల్లి--కొత్తపాలెం ఘాట్ వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర కొత్తగా తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. రహదారి సమస్యను పరిష్కరించకపోతే ఈ ప్రాంత ఆదివాసీ గిరిజనులను సమీకరించి ఉద్యమం చేపడతామని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అత్యవసర వైద్యం, విద్య, రవాణా, నిత్యావసరాల కోసం ఈ రహదారిపైనే ఆధారపడుతున్న గిరిజన ప్రాంత ప్రజల సమస్యను ప్రభుత్వం ఇకనైనా తీవ్రంగా పరిగణించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో జి. అప్పలస్వామి పిసా కమిటీ సెక్రటరీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు జి చిరంజీవి కుమారి తదితరులు పాల్గొన్నారు

## శ్రీ గౌరీ పరమేశ్వర ఆలయం వద్ద అన్న సమారాధన



**గాజువాక:పెన్ పవర్,సెప్టెంబర్21** :పెదగంట్యాడ దుర్గవానిపాలెం శ్రీ గౌరీ పరమేశ్వర ఆలయం వద్ద వినాయక పూజ మహోత్సవాలు 8వ రోజు సందర్భంగా సుమారు 5000 మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు . ముఖ్యఅతిథిగా 74వ వార్డు మాజీ కార్పొరేటర్ తిప్పల వంశి రెడ్డి పాల్గొని ముందుగా గణపతికి పూజలు చేశారు . అనంతరం అన్న సమాఆరాధన ప్రారంబించారు. వంశి రెడ్డి మాట్లాడుతూ నూతన 92వ వార్డు ప్రజలు దుర్గవానిపాలెం గ్రామ కమిటీ ,మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆ గణపతి దీవెనలు ప్రజలందరి పైన ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు . ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు గంట్యాడ గురుమూర్తి ,మార్డుపూడి పరదేశి, గ్రామ కమిటీ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# వైసీపీలో చేరిన కూటమి సానుభూతిపరులు

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 21**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని ఎల్లవరం గ్రామానికి చెందిన గెమ్మెలి పండన్న, గెమ్మెలి గున్నమ్మ, వంచుల అద్దరవీధికి చెందిన కంకిపాటి బాలరాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.పాడేరులో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు సమక్షంలో వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.వంచుల పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు లొంజా గణపతి, కంకిపాటి వీరన్నపడాల్, కృష్ణంరాజు తదితరుల సమక్షంలో ఈ చేరికలు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో వంచుల పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## 5 లక్షల రూపాయలు నిధులతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన.

జడ్పిటిసి పోతురాజు బాలయ్య.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 21.** మండలంలోని కిటుముల పంచాయితీ జాజులపాలెం గ్రామంలో ఐదు లక్షల రూపాయల జడ్పీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి చింతపల్లి జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాజులపాలెం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఐదు లక్షల రూపాయలను మంజూరు చేశారన్నారు. నిధులు మంజూరు చేసిన ఆమెకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదే క్రమంలో గత ఐదేళ్ల వైసిపి పాలనలో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. గతంలో జడ్పీ నిధుల నుండి ఇదే గ్రామంలో మంచినీటి బోరును నిర్మించడం జరిగిందన్నారు. మండలంలో ఐదు సంవత్సరాల కాలంలో సుమారు మూడు కోట్ల పైనే నిధులు తేవడం జరిగిందని అనేక గ్రామాల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని ఆయన అన్నారు. తన పదవీకాలంలో మండలంలో అనేక అభివృద్ధి పనులు చేయడం ఆయనకు సంతృప్తిని ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. పెద్ద ఎత్తున నిధులు రావడానికి సహకరించిన జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గెమ్మెలి రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు వనము పద్మ, వైస్ సర్పంచి సుర్ల అప్పారావు, వైసీపీ యువ నాయకుడు సుందర్, సన్యాసి రావు, కూటమి నాయకులు రామారావు, వెంకటరావు గ్రామస్తులు.

## విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన ఎంతో అవసరం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ అవగాహన కూడా ఎంతో అవసరమని రింతాడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. సుమిత్ర అన్నారు. గూడెంకొత్తవీధి మండలం రింతాడ జి టి డబ్ల్యూ హెచ్ పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు సోమవారం చింతపల్లిలో పారిశ్రామిక సందర్శన చేపట్టారు. వృత్తి విద్యా శిక్షకురాలు ఎ. లీలావతి ఆధ్వర్యంలో విద్యార్థులు చింతపల్లిలోని శ్రీనివాస డ్రెస్ మేకర్స్, శ్రీ దుర్గా కంప్యూటర్ ఎంబ్రాయిడరీ అండ్ మగ్గం వర్క్స్, ఏఎస్ లేడీస్ అండ్ జెంట్స్ టైలర్ పరిశ్రమలను సందర్శించారు.ఈ సందర్భంగా దుస్తుల తయారీ, కటింగ్, కుట్టుపని, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, మగ్గం పనితీరు, వివిధ రకాల అలంకరణ పనులను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించి అవగాహన పొందారు.చదువుతో పాటు వృత్తి విద్యా నైపుణ్యాలను అలవర్చుకుంటే నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహన పత్రాలు లేకుంటే సీజ్ చేస్తాం




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని గూడెంకొత్తవీధి ఎస్సై సురేష్ హెచ్చరించారు.సోమవారం జర్రెలలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎస్సై స్వయంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కొందరు వాహనాలు ఒకరి పేరుపై ఉండగా, వాటికి సంబంధించిన పత్రాలు ఇతరుల పేర్లతో ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. వాహనం కొనుగోలు చేసిన వెంటనే రిజిస్ట్రేషన్‌ను తమ పేరుపై బదిలీ చేయించుకోవాలని సూచించారు. నకిలీ పత్రాలు లేదా సరైన ఆధారాలు లేని పత్రాలతో తిరిగే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, వాహన బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం వంటి అవసరమైన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై సురేష్ హెచ్చరించారు.

## విత్తన గుళికలు తయారీపై రైతులకు అవగాహన.

మండల ఏ ఓ శివరామ ప్రసాద్.




**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 22:** ఎల్ నినో కారణంతో సాగు చేయకుండా ఉన్న పొలంలో విత్తన గుళికలు తయారీ విధానంపై వ్యవసాయ శాఖ మరియు రైతు సాధకార సంస్థ (ఏపీసి ఎన్ ఎఫ్) ఆధ్వర్యంలో రైతులకు వీటి తయారీ విధానం వివరించినట్టు కొయ్యూరు మండల వ్యవసాయాధికారి శివరామ ప్రసాద్ తెలిపారు.ఈ మేరకు నడింపాలెం గ్రామంలో ఆయా ప్రాంతాల్లో రైతులకు వీటిపై ఇక్కడ ఎంపిక చేసిన పొలాల్లో రైతులతో ఆయన పలు చూచనలు అందించారు. ఈ విత్తన గుళికలు తయారీ చేసుకుని పొలంలో వర్షం రాకముందే వేసుకుంటే వర్షం వచ్చిన తరువాత అవి మొలకెత్తి సమయం ఆదా అవుతుందని ఏ ఓతెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ తో పాటు ఏపీసీఎన్ ఎఫ్ మండల యూనిట్ ఇంచార్జి శ్రీనివాస్ ఎంపీఈఓ మాధవి, వి ఏ ఏ లోవలక్ష్మీ, ఐసిఆర్పి సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

# జెర్రెల పీహెచ్‌సీకి అంబులెన్స్ మంజూరు చేయాలి

**పీజీఆర్ఎస్‌లో ఎంపీడీవోకు గ్రామస్తుల వినతి**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**గూడెంకొత్తవీధి మండలం జెర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెంటనే అంబులెన్స్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సుమారు నాలుగు నెలల క్రితం పీహెచ్‌సీ అంబులెన్స్ ప్రమాదానికి గురైనప్పటి నుంచి ప్రత్యామ్నాయ వాహనం అందుబాటులో లేకపోవడంతో జెర్రీల, మొండిగెడ్డ తదితర గిరిజన గ్రామాల ప్రజలు అత్యవసర వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంబులెన్స్ లేక గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, అత్యవసర రోగులను ఆస్పత్రులకు తరలించడంలో ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని సందర్భాల్లో డోలీలపై ప్రధాన రహదారి వరకు తీసుకెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సోమవారం జెర్రెలలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో గ్రామస్తులు ఎంపీడీవో బిహెచ్‌వీ రమణబాబుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జెర్రెల పీహెచ్‌సీకి వెంటనే అంబులెన్స్ మంజూరు చేసి గిరిజనుల అత్యవసర వైద్య అవసరాలను తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

# గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సీటు యాదవులకు కేటాయించాలి

**విశాఖ ఉక్కు యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంచదార్ల పెంటారావు**



**గాజువాక :పెన్ పవర్,సెప్టెంబర్21** : విశాఖలో అత్యధికంగా ఆర్థికంగా సామాజికంగా బలంగా ఉన్న యాదవులకు మేయర్ పీఠం సీటు యాదవుల కేటాయించాలని విశాఖ ఉక్కు యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంచదార్ల పెంటారావు కోరారు. విశాఖ ఉక్కు యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా గాజువాక లో ఉన్న పలు గ్రామాల్లో పరిచయ కార్యక్రమాల్లో భాగంగా మరియు సంఘాన్ని బలోపేతం చేయాలనే దిశగా సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వం మేయర్ సీటు యాదవులకి అవకాశం కల్పించింది. ఇప్పుడున్న పార్టీలు కూడా యాదవులను దృష్టిలో పెట్టి మేయర్ సీటు యాదవుల కేటాయించాలని విశాఖ ఉక్కు యాదవ సంక్షేమ సంఘం తీర్మానం చేయడం జరిగిందని , యాదవుల కేటాయించిన ఎడల ఏ పార్టీకి కూడా యాదవులు మద్దతు ఉండదని ఏ పార్టీ అయితే యాదవులకు మెయిర్ పీఠం అవకాశం కలిపిస్తుందో వారికి యాదవులు మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఘనప రమణ, సంఘం ప్రధాన కార్యదర్శి పల్లా పెంటారావు, సంఘం కోశాధికారి నమ్మి రమణ ,సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉరుకుటి ఎల్లాజీ, సంఘ సభ్యులు నమ్మి సింహాద్రి, ఈపు లోకేష్, బొట్ట సోమేష్, వియ్యపు కొండబాబు, గొల్లగాని లక్ష్మణ్, చొప్ప వెంకట్, ఇసరపు అప్పలనాయుడు, కడుపుట్ల శ్రీను, బొడ్డు రమణ, మామిడి చిరంజీవి, దేవర తాతారావు ,నమ్మి ప్రసాద్ తదితరులు పాల్గొని తీర్మానం చేశారు .

## ప్రమాదాలకు నిలయంగా జెర్రెల ప్రధాన రహదారి

**గుంతలమయమైన రోడ్డుతో ఐదు పంచాయతీల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని జెర్రెల ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ఐదు పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రింతాడ, వంచుల, జెర్రెల, మొండిగెడ్డ, దారకొండ పంచాయతీలకు ప్రధాన రహదారిగా ఉన్న సీలేరు మార్గంలోని ముల్లుమెట్ట సెంటర్ నుంచి మొండిగెడ్డ వరకు రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రహదారి గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలపై ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆయా పంచాయతీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నర్సీపట్నం డిపోకు చెందిన బస్సు రోజుకు మూడు ట్రిప్పులు నడుస్తున్నప్పటికీ, రహదారిపై ఏర్పడిన భారీ గుంతల కారణంగా బస్సులు సైతం తరచూ ఇబ్బందులకు గురవుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో రోగులను తరలించేందుకు కూడా ఈ రహదారి పరిస్థితి తీవ్ర ఆటంకంగా మారుతోందని తెలిపారు. ఇప్పటికే రహదారి అధ్వాన పరిస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదాలు చోటుచేసుకునేలోపు రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని రింతాడ, వంచుల, జెర్రీల, మొండిగెడ్డ, దారకొండ పంచాయతీల ప్రజలు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరుతున్నారు. ప్రమాదాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని ఐదు పంచాయతీల ప్రజలు పేర్కొన్నారు. గుంతలమయమైన జెర్రీల ప్రధాన రహదారిని తక్షణమే పరిశీలించి, అత్యవసర మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ప్రాణాలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఇకపై ఈ రహదారిపై ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి లేకుండా చర్యలు చేపట్టాలని ఐదు పంచాయతీల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరా :పల్లా



**గాజువాక:పెన్ పవర్,సెప్టెంబర్ 21** :తీవ్ర అనారోగ్య సమస్యలతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది, ఆర్థికంగా చితికిపోయిన నిరుపేద కుటుంబాలను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవనిలా పనిచేస్తోందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు . వైద్యం ఖరీదైన నేటి రోజుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పల్లా స్పష్టం చేశారు. దానిలో భాగంగానే నియోజకవర్గానికి చెందిన 9 మందికి సుమారు 7లక్షల 35వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ను అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఆపదలో ఉండి తమ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా త్వరితగతిన నిధులు మంజూరు చేయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని పల్లా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

## కుంకుమపువ్వు సాగు కి ఏ పీ ఎఫ్ డి సి భూములు ఎంపిక.



తహసిల్దార్ త్రివేణి.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 21.**రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న కుంకుమపువ్వు సాగు ప్రాజెక్ట్ చేపట్టేందుకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సమీపంలోను ఏపీ ఎఫ్డిసి కి చెందిన భూములను ఎంపిక చేసామని తహసిల్దార్ హనుమంతు త్రివేణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, చెరువూరు రైతులు సాగు చేసుకుంటున్నా భూములను కుంకుమ పువ్వు సాగుకు తీసుకుంటున్నట్టు పలు పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. అయితే చెరువూరు గ్రామానికి చెందిన భూములను కుంకుమ పువ్వు సాగుకు తీసుకోవడం లేదన్నారు. రైతులు సాగులోనున్న భూములను బలవంతంగా లాక్కునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అయితే కుంకుమపువ్వు సాగుకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వెనుకనున్న ఏపీ ఎఫ్ డి సి కి అప్పజెప్పిన 30 ఎకరాల భూములను కేటాయించామన్నారు. ఈ భూముల్లోనే కుంకుమ పువ్వు సాగు జరుగుతుందని, చెరువులు గ్రామ గిరిజనులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసిల్దార్ తెలిపారు.

## హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దు. హెల్మెట్ తో ప్రాణాలు కాపాడుకోవచ్చు.

చింతపల్లి సీఐ బి. సింహాచలం.




**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 21.** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం వలన ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాపాయ స్థితి నుండి రక్షించుకోవచ్చు అని చింతపల్లి సిఐ బి. సింహాచలం అన్నారు. సోమవారం మండలంలోని అన్నవరం సంతలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, వాహన ఇన్సూరెన్స్ వంటి వాటిని తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా, మద్యం సేవించి వాహనం నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండి, వాహనాలను జాగ్రత్తగా నడపాలని సీఐ సింహాచలం సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. హెల్మెట్ వలన కలిగే ఉపయోగాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలలో అవగాహన పెరగడంతో పాటు, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి అని సదుద్దేశం కరిగిందని పలువురు వాహనదారులు తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్సై సాయిరాం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొండజర్తలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన

**బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన**



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని కొండజర్త గ్రామంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. పిల్లలు ఎలాంటి ఆపదలో ఉన్నా, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పిల్లలను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు పోక్సో చట్టం కీలకమైన రక్షణ కల్పిస్తుందని, బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు టి. సిద్ధు, కె. రాజశేఖర్, ఎస్. అశోక్‌కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, స్థానిక పంచాయతీ కార్యదర్శి రామకోటి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాలతి, పాఠశాల ఉపాధ్యాయులు సాయికన్నా, అంగన్‌వాడీ కార్యకర్త, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సేవా కేంద్రాలలో విత్తనగుళికలు తయారి విధానం



**జి. మాడుగుల.పెన్ పవర్. సెప్టెంబర్ (21)**వర్షభావ పరిస్థితులు నుండి పొలంలో విత్తిన విత్తనాలును సంరక్షిచడానికి మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో విత్తన గుళికల తయారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది అని వ్యవసాయ అధికారి బి. గాయత్రి తెలియజేసారు. సింగర్బ గ్రామం లో జరిగిన కార్యక్రమంలో ఏపీ సి ఎన్ ఎఫ్ మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన గుళికలు తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు.

విత్తన గుళికలు తయారికి కావలిసిన పదార్థములు

1. బీజామృతం
2. బంకమట్టి పొడి
3. గణజీవమృతం పొడి
4. పొయ్యి బూడిద

పైన పెట్టిన పదార్థాలు తో ముందు బీజామృతం తో విత్త నాని విత్తన శుద్ధి చేసి మొదటి లేయర్ గా బంక మట్టిని విత్తనలో వేస్తూ గొనె సంచీ సహాయంతో అటు ఇటు తిప్పాలి. రెండవ లేయర్ గా గణజీవమృతం మూడవ లేయర్ గా పొయ్యిబుడిద వేసి విత్తనాగుళికలు తయారు చేసి భూమి లో వెద జల్లుకోవడం లేదానాటించు కోవాలి అని తెలియజేసారు.

ఉపయోగాలు :వర్షం సకాలంలో పడక పోయిన విత్తనాలు పాడు అవకుండా ఉంటుంది. ఎటువంటి తెగుళ్ల సోకదు అని రైతులుకు వివరించారు.

# డ్రగ్స్ నిర్మూలనకు 'త్రిశూల్' వ్యూహం




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి సాగు నియంత్రణ, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం పాడేరు కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నియంత్రణ సమన్వయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 'త్రిశూల్' వ్యూహంలో భాగంగా జీరో డ్రగ్స్, మహిళలపై అఘాయిత్యాల విషయంలో జీరో టాలరెన్స్, జీరో రోడ్డు ప్రమాదాలు అనే అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న 'చైతన్యం--ప్రజల ఐక్యతతో గంజాయి నిర్మూలన' కార్యక్రమం ద్వారా గ్రామస్థులు గంజాయి సాగుకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా తీర్మానాలు చేస్తున్నారని తెలిపారు. ఇవి ఇతర గంజాయి ప్రభావిత గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు 147 గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి, గత నేర చరిత్ర ఉన్న 82 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. గంజాయి సాగు నియంత్రణకు డ్రోన్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు వివరించారు. యువత, విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు 'సంకల్పం' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలపై నేరాల విషయంలో వేగవంతమైన స్పందన, సోషల్ మీడియా వేధింపులపై నిఘా, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల గుర్తింపు, రహదారి భద్రతా చర్యలపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, జాయింట్ కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ, పోలీస్, విద్య, వైద్య, రవాణా, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్‌వీ నగర్ కాఫీ పరిశోధనా కేంద్రం స్వర్ణోత్సవ వేడుకలు

**కాఫీ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించనున్న ముఖ్యమంత్రి**



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** గూడెంకొత్తవీధి మండలం ఆర్‌వీ నగర్‌లోని ప్రాంతీయ కాఫీ పరిశోధనా స్థానం 50 సంవత్సరాల సేవలను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న స్వర్ణోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్నట్లు కాఫీ బోర్డు సీఈఓ కుర్మరాజు తెలిపారు. స్వర్ణోత్సవ ఏర్పాట్లపై సోమవారం పాడేరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, కాఫీ బోర్డు అధికారులు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. 1976లో ప్రారంభమైన ఆర్‌వీ నగర్ కాఫీ పరిశోధనా కేంద్రం గిరిజన ప్రాంతాల్లో కాఫీ సాగు అభివృద్ధికి, నాణ్యమైన రకాల ప్రోత్సాహానికి, రైతులకు సాంకేతిక సహకారానికి విశేషంగా పనిచేసిందని అధికారులు తెలిపారు. స్వర్ణోత్సవాల్లో కాఫీ సాగు పురోగతి, గిరిజన రైతుల ఆర్థిక అభివృద్ధి, ప్రకృతి వ్యవసాయం, ఈ-పంట, కాఫీ ఉత్పత్తులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. కాఫీ తోటల విస్తరణ, నాణ్యత పెంపు, తెగుళ్ల నివారణ, రైతులకు సాంకేతిక సహాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కాఫీ బోర్డు అధికారులను కోరారు. కాఫీ రైతులతో ముఖాముఖి కార్యక్రమం, ఫొటో ప్రదర్శనలు, క్షేత్ర సందర్శనలు, వీఐపీ, వీవీఐపీ ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో కాఫీ బోర్డు అధికారులు, ఉద్యానవన, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖల అధికారులు, ఆర్‌వీ నగర్ ప్రాంతీయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ శ్రీనివాస్



**నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, అభివృద్ధి పనులపై చర్చ**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 21 :** ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పొలాకి శ్రీనివాస్ సోమవారం విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాస్ ప్రభుత్వ విప్ గణబాబుకు మొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సరఫరా పరిస్థితులు, ప్రజలకు ఎదురవుతున్న విద్యుత్ సంబంధిత సమస్యలు, వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన విద్యుత్ సదుపాయాలపై ఇరువురు చర్చించారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గణబాబు సూచించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న, చేపట్టాల్సిన విద్యుత్ అభివృద్ధి పనులపై కూడా దృష్టి సారించాలని గణబాబు సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఈఈ పొలాకి శ్రీనివాస్‌కు శుభాభినందనలు తెలిపిన ఆయన, జోన్-3 పరిధిలో విద్యుత్ శాఖ సేవలను మరింత మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక భేటీలో విద్యుత్ శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించుకోవడంతో పాటు, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.

# జెర్రెల పీజీఆర్‌ఎస్‌కు 44వినతులు

- జె.కొత్తూరుకు రహదారి, అంగన్‌వాడీ కార్యకర్తను నియమించాలని విష్ణుమూర్తి డిమాండ్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**గూడెంకొత్తవీధి మండలం జెర్రెలలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 44 వినతులు అందాయి. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు పొత్తూరు విష్ణుమూర్తి జె.కొత్తూరు గ్రామ సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు, అత్యవసర సమయాల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.అదేవిధంగా జె.కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో చాలా కాలంగా ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టును భర్తీ చేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని అధికారులను కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు త్వరితగతిన స్పందించి సమస్యలను పరిష్కరించాలని విష్ణుమూర్తి విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా

**ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికైన పిల్లి వీర్రాజు**




**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 21**: ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యుడిగా తనను ఎన్నుకుని బాధ్యతలు అప్పగించిన జిల్లా కమిటీకి పిల్లి వీర్రాజు కృతజ్ఞతలు తెలిపారు.
ఇటీవల గాజువాక లో జరిగిన ఏఐటీయూసీ 14వ మహాసభలో జిల్లా కమిటీలోతనను జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నుకోవడం పట్ల పిల్లి వీర్రాజు హర్షం వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో, బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని తెలిపారు.
ముఖ్యంగా ఆరిలోవ 10, 11, 12వ వార్డులతో పాటు ఆరిలోవ ప్రాంతంలోని ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఆయా ప్రాంతాల్లో స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.తనపై జిల్లా కమిటీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజలు మరియు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారికి అండగా ఉంటానని ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు పిల్లి వీర్రాజు తెలిపారు.

# వరసిద్ధి వినాయకుడి అన్నదానంలో ప్రభుత్వ విప్ గణబాబు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 21 :** గోపాలపట్నం మెయిన్ రోడ్డులో వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన స్వామివారి అన్నదాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ గణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్ గణబాబు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించడంతో పాటు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు టీడీపీ ఇంచార్జ్ దాడి రమేష్ నాయుడు, నారిపిన్ని సత్తిరాజు, వర్తక సంఘం ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నాయకులు ఆకాంక్షించారు.

# రెవెన్యూ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

**ప్రజా సేవల్లో జాప్యం సహించేది లేదు: జేసీ తిరుమణి శ్రీపూజ**



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**రెవెన్యూ శాఖలో ప్రజలకు అందించే సేవలను వేగవంతం చేసి, పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ అధికారులను ఆదేశించారు. సోమవారం పాడేరు కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.రీ-సర్వే, భూహక్కు--భూరక్ష, భూ రికార్డుల ప్రక్షాళన, భూ వివాదాల పరిష్కారాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ రికార్డులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.రాబోయే ఎన్నికల సన్నాహకాలు, ఓటర్ల జాబితా సవరణ, మెజిస్ట్రీరియల్ విధులు, శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయడంతో పాటు సీఎం సహాయ నిధి, ఇతర సహాయక దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.రెవెన్యూ రికవరీ చట్టం కింద బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సెక్షన్ సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను హెచ్చరించారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, సర్వే--ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. అప్పలస్వామి, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి ధర్మరాజు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాంఘిక పరివర్తనకు కృషి చేసిన మహాకవి గురజాడ



**మూఢ విశ్వాసాల నిర్మూలనకు తన రచనలతో చైతన్యం**

**యూజేఎఫ్ అధ్యక్షులు డా. ఎం.ఆర్.ఎన్. వర్మ**

**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** తన సాహిత్యం, నాటకాల ద్వారా సమాజంలో నెలకొన్న మూఢ విశ్వాసాలు, సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేసిన మహాకవి గురజాడ అప్పారావు అభ్యుదయవాది అని ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యూజేఎఫ్) అధ్యక్షులు డాక్టర్ ఎం.ఆర్.ఎన్. వర్మ అన్నారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సోమవారం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరవలోని అక్షయ పాఠశాలలో గురజాడ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డా. ఎం.ఆర్.ఎన్. వర్మ మాట్లాడుతూ గురజాడ తన రచనలు, నాటకాల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేశారని పేర్కొన్నారు. ప్రజల్లో ఆలోచనా విధానాన్ని పెంపొందించి, సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం దక్కాలనే సందేశాన్ని తన రచనల ద్వారా అందించారని తెలిపారు. సమాజంలోని అన్యాయాలు, అసమానతలు, మూఢ నమ్మకాలపై ప్రజలను ఆలోచింపజేసిన గురజాడ ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గురజాడ వంటి మహనీయుల ఆలోచనలు, రచనలు నేటి సమాజానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతోమంది గొప్ప వ్యక్తులను, సాహితీవేత్తలను, సామాజిక చైతన్యవేత్తలను అందించిందని డా. వర్మ అన్నారు. వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను యూజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వారు సమాజాభివృద్ధికి చేసిన కృషిని నేటి తరానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు. చరిత్రలో వారి పాత్రను గుర్తించడం ద్వారా యువతలో స్ఫూర్తిని కలిగించవచ్చన్నారు. ఆరాధన చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు సాయి గురూజీ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న రుగ్మతలను తొలగించేందుకు గురజాడ అప్పారావు విశేష కృషి చేశారని అన్నారు. దేశభక్తి, సామాజిక బాధ్యత, మానవతా విలువలను పెంపొందించేలా ఆయన రచనలు ప్రజలను ఆలోచింపజేశాయని పేర్కొన్నారు. సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో గురజాడ సాహిత్యం కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు గురజాడ అప్పారావు జీవితం, సాహిత్య సేవ, సామాజిక సంస్కరణల గురించి వివరించారు. ఆయన రచనలు, ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో యూజేఎఫ్ ప్రతినిధులు డి.హరనాథ్, ఎస్. అరుణ్ కుమార్, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నలుగురికి జైలు శిక్ష

- ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా
- నర్సీపట్నం ఏ జె ఎఫ్ సి ఎం కోర్టు తీర్పు



**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 21) :**నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నలుగురు వ్యక్తులకు ఎ జె ఎఫ్ సి ఎమ్ కోర్టు, నర్సీపట్నం సోమవారం శిక్ష విధించింది. ప్రతి ఒక్కరికి రూ.10,000 చొప్పున జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. వారిలో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష, మరొకరికి రెండు రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి ఒక్క రోజు చొప్పున జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, దీంతో వాహనదారులతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని నర్సీపట్నం టౌన్ పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని సూచించారు. మద్యం సేవించిన వారు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలను వినియోగించుకుని తమతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసులు కోరారు. “మద్యం సేవించి వాహనం నడపవద్దు, మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడండి” అని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నర్సీపట్నం టౌన్ పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ గఫూర్ తెలిపారు.

# గురజాడ భావితరాలకు స్ఫూర్తిదాత




**సమాజ చైతన్యానికి ఆయన రచనలు దిక్సూచి: డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 21 :** ప్రముఖ కవి, రచయిత, సంఘ సంస్కర్త గుర జాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలను సోమవారం విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్ర పటానికి జిల్లా రెవెన్యూ అధికారి డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భం గా డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు మాట్లాడు తూ గురజాడ వెంకట అప్పారావు భావితరాల కు స్ఫూర్తిదాతగా నిలిచారని అన్నారు. సమాజంలో నెలకొన్న సామాజిక అసమానత లు, మూఢనమ్మకాలు, అన్యాయాలను తన రచనల ద్వారా ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం తీసు కురావడంలో గురజాడ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన రచనలు సమాజాన్ని ఆ లోచింపజేయడంతో పాటు మార్పు వైపు నడి పించేలా ఉన్నాయని పేర్కొన్నారు.దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్’ అం టూ గురజాడ ఇచ్చిన సందేశం నేటికీ ప్రతి ఒక్క రికీ స్ఫూర్తినిస్తోందన్నారు. ప్రజల జీవన విధా నం, సామాజిక పరిస్థితులను తన రచనల్లో ప్రతిబింబిస్తూ సమాజ సంస్కరణకు కృషి చేసిన మహనీయుడిగా గురజాడకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు.గురజాడ రచనలు తన వ్యక్తిగత జీవితంపైనా ఎంతో ప్రభావం చూపా యని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తెలిపారు. తన జీవితంలో ఎదుగుదలకు, సమాజం పట్ల అవగాహన పెంపొందించుకోవడానికి గురజాడ రచనలు ఎంతగానో దోహదపడ్డాయని చెప్పా రు. నేటి యువత గురజాడ సాహిత్యాన్ని చదివి, ఆయన ఆశయాలను అర్థం చేసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికా రిణి జె. మాధవి, డిప్యూటీ కలెక్టర్లు టి. గోవిందు, శేషశైలజ, ఏడీసీ రమణమూర్తి తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణులకు జిల్లా స్థాయిలో సంగీత పాఠశాల ఏర్పాటు చేయాలి

**గాజువాక ఎమ్మెల్యే పల్లాకు నాయి బ్రాహ్మణ సంఘం వినతి**



**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 21 :**విశాఖ జిల్లాలో నాయి బ్రాహ్మణుల కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక సంగీత పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం (రి.నెం.500/82) ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు మరోసారి వినతిపత్రం అందజేశారు. సుమారు 1000 గజాల స్థలంలో సంగీత పాఠశాల నిర్మించి, నాయి బ్రాహ్మణ యువతకు బ్యాండు, సన్నాయిమేళం వంటి సంప్రదాయ కళల్లో శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణుల వృత్తిలో భాగమైన బ్యాండు, సన్నాయిమేళం వంటి సంప్రదాయ కళలు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కళలను భావితరాలకు అందించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విశాఖ జిల్లాలో ప్రత్యేకంగా సంగీత పాఠశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నాయి బ్రాహ్మణులకు ప్రత్యేక సంగీత పాఠశాల లేకపోవడంతో కళాకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో సుమారు 1000 గజాల విస్తీర్ణంలో సంగీత పాఠశాల నిర్మించి, అవసరమైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరినట్లు చెప్పారు. అలాగే కులవృత్తిని కొనసాగిస్తున్న నాయి బ్రాహ్మణులకు 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ అందించే అంశాన్ని తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో చేర్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధుల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. అతి త్వరలో సంగీత పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే కులవృత్తి చేసుకుంటున్న నాయి బ్రాహ్మణులకు పెన్షన్ అందించే అంశంపై కూటమి ప్రభుత్వం త్వరలో ఆలోచించి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కోడూరు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, అధికార ప్రతినిధి బల్లంకి వెంకట్రావు, పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు గోల్కొండ కర్ణాకర్, దక్షిణ నియోజకవర్గ అధ్యక్షులు చల్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జల సంరక్షణే మన రక్షణ



- ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించాలి
- జల సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత
- కళా సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 21 :** నీరు ప్రతి జీవికి ప్రాణాధారమని, ప్రస్తుతం వర్షపాతం లోపం, భూగర్భ జలాల అడుగంటడం వంటి కారణాలతో అనేక ప్రాంతాల్లో నీటి లభ్యత క్లిష్టంగా మారుతోందని కళా సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు అన్నారు. నీటిని సంరక్షించకపోతే భవిష్యత్ తరాలు తీవ్ర నీటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని, నీటి పొదుపును ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రేటర్ విశాఖపట్నం గోపాలపట్నం పౌర గ్రంథాలయంలో కళా సేవా పీఠం ఆధ్వర్యంలో “జల సంరక్షణకై కృషి చేద్దాం--ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మిద్దాం” అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నందవరపు సోములు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా జల సంరక్షణ ఉద్యమంలో భాగంగా యువజన సంఘాలు, మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తూ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నీటి వనరులను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు తాగునీటి భద్రత కల్పించవచ్చున్నారు. కళా సేవా పీఠం గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునేలా విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపు నీరు వృథాగా బయటకు వెళ్లకుండా ఇంటి వద్ద చిన్న కాలువ ఏర్పాటు చేసి ఇంకుడు గుంతకు మళ్లించాలని సూచించారు. ఇంకుడు గుంతల్లోకి చేరిన వర్షపు నీరు భూమిలోకి ఇంకడం ద్వారా భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉంటుందని, తద్వారా తాగునీటి సమస్య కొంతమేర తగ్గుతుందని పేర్కొన్నారు. కళా సేవా పీఠం మాజీ అధ్యక్షులు గోరకల రామదాసు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మనకున్న నదులు, ఆనకట్టలు, చెరువులను పరిరక్షించుకోవడంతో పాటు వాటిలోని నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రస్తుతం వినియోగంలో లేని బావుల్లోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కళా సేవా పీఠం ప్రధాన కార్యదర్శి కొంతం నూక రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి కాలనీలో ఇంటింటా నీటి సంరక్షణపై ప్రచారం నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రేపటి తరానికి మంచినీరు అందించాలంటే ప్రతి ఇంట్లో వర్షపు నీటిని పొదుపు చేసే విధానాలను అమలు చేయాలని, అందులో ఇంకుడు గుంతలు కీలకమని పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, కళా సేవా పీఠం సహాయ కార్యదర్శి ఎం.ఎన్.వి. శ్రీనివాస్ మాట్లాడుతూ కళా సేవా పీఠం కేవలం కళా సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా జల సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సదస్సు అనంతరం “జల సంరక్షణకై కృషి చేద్దాం--ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మిద్దాం” అనే నినాదంతో గోపాలపట్నం మెయిన్‌రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వారు నీటిని వృథా చేయవద్దని, వర్షపు నీటిని ఒడిసిపట్టాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళా సేవా పీఠం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొప్పిశెట్టి వెంకట్, గోపాలపట్నం పౌర గ్రంథాలయ అధికారి ఎన్.వి. నరసింహ, సహాయ కోశాధికారి వల్లూరి జగదీష్ చంద్రశేఖర్, మాజీ గౌరవ అధ్యక్షులు కంపర అప్పారావు, కంపర కనకరాజు, మిద్దె అప్పారావు, భాస్కర్ పాణిగ్రహి, అనపర్తి అప్పారావు, వై. రమణారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎం. అప్పలనాయుడు, శరగడం మోహన్ కృష్ణ, సింహాచలం, పి.వి. ప్రసాద్, ఎల్లాజీ రావు, నవీన్ కుమార్, కె. నాగలక్ష్మి, అడప శోభారాణి, చిన్నమ్మలు, గంట్యాడ పద్మ, వరలక్ష్మి, పెంటయ్య, కంచిపాటి వెంకటరమణ, కంపర శంకరరావు, ఏ. సూర్యచంద్ర, కడిమి అప్పలనాయుడు తదితరులు పాల్గొని జల సంరక్షణ కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

# ఏపీ సూపర్ యాప్‌తో పరిపాలనా సామర్థ్యం పెంపు

- పనుల కేటాయింపు, పర్యవేక్షణకు సమర్థవంతమైన వేదికగా వినియోగించాలి
- అడవితల్లి బాటకు శాఖల వారీగా ముందస్తు కార్యాచరణ చేపట్టాలి
- జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ సూపర్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిర్వహణ, పర్యవేక్షణను మరింత సులభతరం చేసి పరిపాలనలో జవాబుదారీతనం, సామర్థ్యాన్ని పెంపొందించాలని పోలవరం ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.

పోలవరం జిల్లాలోని అన్ని శాఖల విభాగాధిపతులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది ఏపీ సూపర్ యాప్‌లో నమోదు చేసుకుని చురుగ్గా వినియోగించాలని సూచించారు. ఉన్నతాధికారుల నుంచి అప్పగించే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. పనుల కేటాయింపు, పర్యవేక్షణ, పురోగతి పరిశీలన, సకాలంలో చర్యలు తీసుకోవడం, అమలు వివరాలను నమోదు చేయడం వంటి అంశాలకు ఏపీ సూపర్ యాప్‌ను సమర్థవంతమైన వేదికగా ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వ సేవలు, కార్యక్రమాల అమలులో వేగం, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**త్వరగా నమోదు పూర్తి చేయాలి**

గూగుల్ ప్లే స్టోర్‌లో ‘ఏపీ సూపర్ యాప్’ను శోధించి యాప్‌ను ఏర్పాటు చేసుకుని, ‘సైన్ అప్’ ద్వారా సంబంధిత శాఖ, హోదా, రిపోర్టింగ్ అధికారి, మొబైల్ నంబర్, ఈమెయిల్, పాస్‌వర్డ్ తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు. వివరాల పరిశీలన అనంతరం అనుమతి లభించిన తర్వాత ‘సైన్ ఇన్’ ద్వారా యాప్‌లోకి ప్రవేశించవచ్చని తెలిపారు.

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు వీలైనంత త్వరగా నమోదు ప్రక్రియను పూర్తి చేసి, అధికారిక పనుల నిర్వహణకు యాప్‌ను నిరంతరం వినియోగించాలని కోరారు. యాప్ ద్వారా అప్పగించిన పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయడం ద్వారా పరిపాలనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

యాప్ వినియోగంలో సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే జాయింట్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆనంద్ లేదా సాంకేతిక బృందానికి చెందిన యశ్వంత్‌ను సంప్రదించాలని తెలిపారు.

**అడవితల్లి బాటకు అధికారులంతా సన్నద్ధం కావాలి**

అడవితల్లి బాట కార్యక్రమం నేపథ్యంలో సెప్టెంబర్ 26న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన ఉండే అవకాశం ఉన్నందున అధికారులు పూర్తి సన్నద్ధతతో ఉండాలని జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ సూచించారు. గతంలో నిర్వహించిన ఉన్నతస్థాయి పర్యటనల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కార్యక్రమానికి సంబంధించి శాఖల వారీగా బాధ్యతలు, అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రత, రవాణా, పారిశుధ్యం, వైద్య సేవలు తదితర అంశాలపై ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# నగరంలో మేయర్ అభ్యర్థుల మేళా హాస్యాస్పదం



- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఎద్దేవా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** కూటమిలో సఖ్యత లోపం, అధిష్టానం పై నమ్మకం లేక రాజమండ్రి అంగడి లో కారుచౌకగా మేయర్ అభ్యర్థుల మేళా జరుగు తుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఎద్దేవా చేసారు. అర్పిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ, అధికార కూటమి నుండే మేయర్ అభ్యర్థుల సంఖ్య పోటా పోటిలు జరుగుతు న్నాయన్నారు. ఒక మేయర్ గా పోటీ చేయటానికి అర్హత, వ్యక్తిత్వం, ప్రజా పోరాటాల చరిత్ర అవసరం అని గమనించకుండానే నేను మేయర్ అంటే నేనని ప్రకటించుకోవటం సంతల్లో బర్రె దూడల బేరగాళ్ళ మాదిరి మేయర్ అభ్యర్థుల పోటి ప్రకటనలు జరుగుతు న్నాయని విమర్శించారు. ఇప్పటి వరకు మేయర్ అభ్యర్థులుగా ప్రకటించు కున్న వారిలో పోటి చేయటానికి ఉన్న అర్హతల పై ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. మేయర్ అభ్యర్థుల ప్రకటనలు చూస్తుంటే ద్విచక్ర వాహన మేళాలు నిర్వహించేవారు సైతం సిగ్గు పడుతున్నారన్నారు. రాజకీయ విజ్ఞత లేని, సామాజిక విలువలు తెలియని వారికి ప్రాధాన్యత నిస్తు పేమెంట్ వార్తలతో మీడియా విలువలను కాలరాస్తున్నారని ధ్వజ మెత్తారు. నగర పాలక సంస్థకు ఎన్నికలు జరుగుతాయా ? జరగనిస్తారా ? విలీన 10 పంచాయితీలకు ఏ మేలు కోసం న్యాయస్థానంలో కేసులతో కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. పంచాయితీ స్థాయి ఆస్తి పన్నులు కార్పొరేషన్ స్థాయిలో వసూలు జరుగుతాయనే భావనతో కోర్టు కేసులు దాఖలు చేసిన నాయకులు ఆ 10 పంచాయితీల్లో అమలవుతున్న పన్నుల తీరుకు, కార్పొరేషన్ పన్నుల తీరుకు తేడా లేదన్న సంగతి గమనించా లన్నారు. నేతల స్వార్ధ రాజకీయలతో 10 గ్రామాల ప్రజలు, నగర ప్రజలు నష్ట పోతున్నరనే నిజాన్ని గ్రహించకుండా పాలక నేతలు కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. మేయర్ అభ్యర్థిగా కూటమి పార్టి నుండి ఒక నేత పేరు ఇప్పటికే ఖరారు అయినట్టు తమకు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు . నగర కేంద్రంగా దశాబ్దల తరబడి పేపర్ మిల్లు కాలుష్యం , గోదావరి జలాలపరిశుభ్రత , పరిరక్షణ పై ప్రజ సమస్యల పై ఉద్యమగళం వినిపిస్తున్నది రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రజలను ఓటు అడిగే అర్హత అర్పిసి పార్టికి మాత్రమే వుందన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్పొరేషన్ కు ఎన్నికలు నిర్వహిస్తే ప్రజల మద్దత్తుతో అర్పిసి ఎన్నికల బరిలో ప్రధాన పోటీదారు గా నిలుస్తుందని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తెలిపారు. ఈ సభ లో అర్పిసి సెక్యులర్లు పంగులూరి బుచ్చిబాబు, వూటుకోరు వెంకట చలపతి, పి. కరిముల్లా, ఎస్. మహబూబ్ బాషా, అమిర్ బాషా , డి వి రమణమూర్తి , దుద్దే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , కారుమూరి యుగంధర్ , గుడ్ల దుర్గా ప్రసాద్ , బసా సోనియా , కందివలస రమణ , లంక సత్యనారాయణ , చల్లా సాంబశివరావు , చల్లా వంశీ , తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

- డబ్ల్యూజేహెచ్ఎస్ ప్రీమియంకు నిధులు విడుదల చేయాలి
- పీజీఆర్ఎస్‌లో అధికారులకు లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ వినతి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** జర్నలిస్టులకు పెండింగ్‌లో ఉన్న ప్రెస్ అక్రిడిటే షన్లను మంజూరు చేయాలని, వర్కింగ్ జర్నలి స్ట్స్ హెల్త్ స్కీమ్ డబ్ల్యూజేహెచ్ఎస్ ప్రీమియం చెల్లింపునకు అవసరమైన నిధులను విడుదల చేయాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరిని కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎ స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి జర్నలిస్టుల సమస్యలను వివరించా రు. ఇప్పటికే రెండు దఫాల్లో జర్నలిస్టులకు ప్రెస్ అక్రిడిటేషన్లు మంజూరు చేశారని, మరికొన్ని దరఖాస్తులను మూడో జిల్లా మీడియా అక్రిడిటే షన్ కమిటీ డీఎంఏసీ సమావేశంలో పరిశీలించి మంజూరు చేస్తామని పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపారు. కొత్తగా స్థానిక పత్రికలను ప్రారంభిం చిన వారు, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు సైతం అక్రిడి టేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. జీవో నంబర్ 84 ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి డీఎంఏసీ సమావేశం నిర్వ హించాల్సి ఉన్నప్పటికీ, ఆరు నెలలు గడిచినా సమావేశం నిర్వహించలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటే షన్లు మంజూరు చేయాలని కోరారు.

అదేవిధంగా ప్రతి ఏడాది మాదిరిగానే వర్కింగ్ జర్నలిస్ట్స్ హెల్త్ స్కీమ్ డబ్ల్యూజేహెచ్ఎస్ ప్రీమి యం చెల్లింపునకు సీఎస్ఆర్ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది కేవలం 130 మంది జర్నలిస్టులకు మాత్రమే ప్రీమియం మొత్తాన్ని చెల్లించారని, ఈ విషయం తెలియక పలువురు జర్నలిస్టులు ఇంకా దరఖాస్తు చేసు కోలేదని తెలిపారు. మిగిలిన అర్హులైన జర్న లిస్టులకు కూడా ప్రీమియం చెల్లించేందుకు అవ సరమైన నిధులను తక్షణమే మంజూరు చేయా లని కోరారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటామని జాయిం ట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి హామీ ఇచ్చారు. సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ, ప్రతిని ధులు ఆర్. అబ్బాస్, బి. నారాయణరావు, మొల్లి కమల్ కుమార్, ఎం. శ్రీహరి, రమణమూ ర్తి, కె. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రాజ్మా విత్తనాల పంపిణీ

- రైతులు సాగు చేసి మంచి లాభాలు పొందాలి.
- టీడీపీ నేతలు చెండా బాపూజీ, రఘునాథ్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 21.** మండలంలోని మాకవరం పంచాయతీ పరిధిలో గిరిజన రైతులకు రాజ్మా విత్తనాలు పంపిణీ చేసినట్లు టిడిపి నాయకులు చెండా బాపూజీ రఘునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. ప్రతి రైతు ఈ విత్తనాలు తీసుకొని సాగు చేసి మంచి లాభాలు పొందాలని పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ టీడీపీ నాయకం గోపాలరావు, నాయకం ప్రసాద్, పాంగి ప్రహ్లాద్, బిసోయి సన్యాసి, మధు రామచందర్, గంగా రామచందర్, హీరన్న గ్రామ సచివాలయ సిబ్బంది ఝూన్సీ, రామానాయుడు, రంగారావులతో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పంచాయతీ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ద

# 12 వ వార్డు సూర్యతేజ నగర్ లో ఘనంగా అన్నసమారాధన

భక్తులకు ప్రసాద వితరణ చేసిన విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 21:** జీవీఎంసీ 12వ వార్డు పరిధి సూర్యతేజ నగర్ లో శ్రీ పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు 12వ వార్డు అధ్యక్షులు మొల్లి హేమంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శి కన్నేటి సుబ్బారెడ్డి, సంజీవ్, బోనెల ప్రసాద్, వినోద్, వంశీ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com

# లోకల్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...



**విజయవాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది. ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

# జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?



**ఒంగోలు సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక ఛత్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు. జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

# కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా

**తిరుమల, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు. అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్రే. ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రీఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది. మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిది. ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది. కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కడూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమీషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమీషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది.

### చైర్మన్ పీఏ ... చైర్మన్ చెప్పకుండా చేయగలడా?

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక చైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్ఏ చట్టం కింద మనీ ట్రయల్ ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమీషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం. అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.

## 100 శాతం స్ట్రైక్ రేటుపై గురి

**కాకినాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ అత్యంత పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తోంది. పొత్తుల రాజకీయంలో సీట్ల సంఖ్య కోసం వెంపర్లాడే సాంప్రదాయ ధోరణికి భిన్నంగా.. పోటీ చేసిన ప్రతిచోటా గెలిచి తీరాలనే దృఢ నిశ్చయంతో అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు జనసేన క్షేత్రస్థాయి వ్యూహాన్ని స్పష్టం చేశాయి. మనం తీసుకునే ప్రతిదీ గెలిచే సీటే తీసుకుందాం. కేడర్ నుంచి ఒత్తిడి ఉంది కదా అని గుడ్డిగా 60, 70 లేదా 120 సీట్లు తీసుకోము అని తేల్చిచెప్పడం ద్వారా.. సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలపైనే పార్టీ పూర్తి దృష్టి పెట్టిందన్న స్పష్టమైన సంకేతాన్ని శ్రేణులకు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేసి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన రికార్డును స్థానిక సమరంలోనూ పునరావృతం చేయడమే పార్టీ ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొంటూనే విశాఖ కార్పొరేషన్‌లో 3 వార్డులు గెలవడంతో పాటు 7 చోట్ల రెండో స్థానంలో నిలిచిన చరిత్రను పార్టీ గుర్తుచేసుకుంటోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలనాపరమైన పనితీరు ప్రజల్లో సానుకూలతను పెంచిన వేళ.. క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని పట్టున్న వార్డులు, డివిజన్లను గుర్తించి అక్కడ మాత్రమే పూర్తి బలంతో బరిలోకి దిగాలని అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. కూటమిలో భాగస్వామిగా ఉంటూ అనవసర డిమాండ్లతో సమన్వయాన్ని దెబ్బతీయకుండా, వాస్తవ బలాబలాల ఆధారంగానే సీట్ల సర్దుబాటు ఉండాలనేది జనసేన లైన్. ఏదో ప్రభావం చూపే స్థానంలో ఉన్నాం కదా అని మిత్రపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ సీట్లు తీసుకోవడం.. ఆ తర్వాత సమన్వయం లేక లేదా అభ్యర్థుల బలహీనత వల్ల చేజేతులా ఓడిపోవడం వంటి తప్పులకు జనసేన తావివ్వదలుచుకోలేదు. స్థానిక సమస్యలపై పట్టు, ప్రజల్లో నిరంతరం ఉండే నాయకత్వం, గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులు ఉన్న చోట మాత్రమే కూటమి తరఫున జనసేన సీట్లను క్లెయిమ్ చేయాలని నిర్ణయించింది. ఇది అటు కూటమి ఐక్యతను కాపాడటంతో పాటు, ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీకి ఏ ఒక్క స్థానంలోనూ పట్టు చిక్కకుండా చేసే వ్యూహాత్మక ఎత్తుగడ. పార్టీ శ్రేణులకు నాయకత్వం ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేసింది. టికెట్ రాగానే గెలిచేసినట్లు భావించే అతివిశ్వాసం వద్దని, సోషల్ మీడియాలో వచ్చే అనవసర ప్రచారాలు, సీట్ల సంఖ్యపై సాగే చర్చలను పట్టించుకోవద్దని తేల్చిచెప్పింది. అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుది నిర్ణయమని, పార్టీ ఎక్కడ పోటీ చేసినా అక్కడ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. సంఖ్యతో కూడిన డాంబికాల కంటే.. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ విజయకేతనం ఎగురవేసి అన్‌బీటెన్ బ్రాండ్‌ను కాపాడుకోవడమే జనసేన అసలైన స్థానిక మంత్రంగా కనిపిస్తోంది.

# పవన్ ఏం చెబుతారో... సర్వత్రా ఉత్కంఠ !



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 22న కాకినాడ వేదికగా కీలకమైన పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జరుగుతోంది. దాంతో స్థానిక ఎన్నికల విషయంలో జనసేన వ్యూహాలు ఏమిటి ఆ పార్టీ పోటీ చేసే సీట్లు ఎన్నికల పొత్తులలో వ్యవహరించే విధానం మీద అంతటా ఆసక్తి అయితే ఉంది. ఎందుకంటే 2024 ఫార్ములాను జనసేన నేతలు ఇప్పటికే కాదు కూడదని చెప్పారని అంటున్నారు. అంతే కాదు 30 శాతం సీట్లు తమకు దక్కాలని కోరుకుంటున్నారు అని కూడా ప్రచారంలో ఉంది. అయితే అదే సమయంలో జనసేన అగ్ర నేత మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ బలం ఉన్న చోటనే జనసేన పోటీ పడాలని సూచించినట్లుగా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ కీలక సమావేశం మీద అందరి ఫోకస్ ఉందిపుడు.

**తీవ్ర అసంతృప్తితో :**

ఇదిలా ఉంటే నాదెండ్ల మనోహర్ బలం ఉన్న చోట పోటీ పడాలని బాధ్యత కలిగిన పార్టీగా జనసేన వ్యవహరించాలని సూచించినట్లుగా ప్రచారం సాగింది. దీని మీద జనసైనికులు అయితే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అని అంటున్నారు. ఎందుకంటే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని చాలామంది పెద్ద ఎత్తున ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ తరహా ప్రకటనలు వారి ఆశల మీద నీళ్ళు చల్లుతున్నాయి. దాంతో ఈ పరిణామాల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ వెంటనే ఒక అతి ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడంతో పవన్ ఏమి చెబుతారు అన్నది అయితే చర్చకు వస్తోంది.

**పవన్ డెసిషన్ అంటే :**

ఇక చూస్తే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ అధినేత హోదాలో ఏది చెప్పినా అదే ఫైనల్ అని అంటున్నారు. ఈసారి ఎక్కువ సీట్లు తీసుకుని కూటమితో కలసి పోటీ చేస్తామని పవన్ కనుక ప్రకటిస్తే ఆ లెక్క వేరే ఉంటుందని అంటున్నారు. ఎందుకంటే దశాబ్దం పైగా జనసేన నాయకులు కానీ క్యాడర్ కానీ పార్టీ కోసం ఎంతగానో శ్రమించారు అని ఇప్పుడు వారికి గ్రౌండ్ లెవెల్ లో అధికారం అందుకునే చాన్స్ వచ్చిందని అంటున్నారు. అదే విధంగా పార్టీలో క్షేత్ర స్థాయిలో ఆశలు ఆకాంక్షలకు పవన్ నిర్ణయాలు ప్రతిబింబిస్తాయని కూడా అనేక మంది భావిస్తున్నారు. అయితే జనసేన కూటమిలో అతి ముఖ్య భాగస్వామి. కాబట్టి ఆచీ తూచీ నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. దాంతో బాలెన్స్ గానే జనసేన విధానాలు కానీ ఆలోచనలు కానీ ఉంటాయని చెబుతున్నారు. అలా కనుక చూస్తే ఏ రకమైన తీర్మానం వెలువడుతుంది అన్నది కూడా ఉత్కంఠను రేపేదిగా ఉంటుందని అంటున్నారు.

**కందులకు బాధ్యతలు :**

మరో వైపు చూస్తే జనసేన పార్టీకి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార సారథ్యాన్ని కో ఆర్డినేట్ చేసుకునే కీలక భూమికను మంత్రి కందుల దుర్గేష్ కి పవన్ అప్పగించారు. దీంతో ఆయన మీద మరింత కొత్త భారాలు పెరిగాయని అంటున్నారు. సౌమ్యుడిగా ఉంటూ అందరికీ కలుపుకుని పోయే కందులకు జనసేన ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ గాబాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీలో హర్షం వ్యక్తం అవుతోంది అని అంటున్నారు. అలాగే జనసేన శ్రేణులను ఏకమొత్తంగా ముందుకు నడిపించే సామర్థ్యం ఆయనకు ఉందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే చాలా కాలం తరువాత స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట పవన్ కాకినాడలో తన పార్టీ శ్రేణులతో నిర్వహించే కీలక సమావేశం మీద జనసేన మాత్రమే కాదు ఏపీ రాజకీయ మొత్తం నిశితంగా చూస్తోంది అని అంటున్నారు.

## గోల్డ్ మెడల్ పోరులో భారత్ vs శ్రీలంక: ఆసియా గేమ్స్ ఫైనల్ మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ చూడాలంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 మహిళల క్రికెట్ విభాగంలో అత్యంత కీలక ఘట్టం ఆసన్నమైంది. పసిడి పతకం కోసం డిఫెండింగ్ ఛాంపియన్ భారత మహిళల క్రికెట్ జట్టు శ్రీలంక మహిళల జట్టు (మంగళవారం, సెప్టెంబర్ 22) హోరాహోరీగా తలపడనున్నాయి. జపాన్‌లోని నిషిన్‌లో ఉన్న కోరోగీ స్పోర్ట్స్ పార్క్ వేదికగా ఈ చారిత్రాత్మక ఫైనల్ పోరు జరగనుంది.

**అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు భారత్, లంక:**

భారత్ ఘన విజయం: బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో ఓపెనర్ షెఫాలీ వర్మ కేవలం 49 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు చేసి రికార్డు సెంచరీతో విరుచుకుపడింది. దీంతో భారత్ 20 ఓవర్లలో 195/4 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్‌ను 81 పరుగులకే ఆలౌట్ చేసి 114 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఇదే మ్యాచ్‌లో స్మృతి మంధాన మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది.

శ్రీలంక ఊచకోత: పాకిస్థాన్‌తో జరిగిన మరో సెమీఫైనల్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి అతపత్తు (50 బంతుల్లో 83 నాటౌట్) చెలరేగడంతో 178 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసింది.

**మరోసారి ఆసియా కప్ రిపీట్:**

ఈనెల ఆరంభంలో దుబాయ్‌లో జరిగిన మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్‌లోనూ భారత్ వర్సెస్ శ్రీలంక జట్లే పోటీపడ్డాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుంది. ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్లోనూ ఈ రెండు జట్లు తలపడతుండటం విశేషం. 2022 హ్యాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో స్వర్ణం గెలుచుకున్న టీమిండియా, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. శ్రీలంక జట్టు ఆసియా గేమ్స్‌లో తమ తొలి క్రికెట్ గోల్డ్ మెడల్ సాధించాలని భావిస్తోంది.

**హెడ్ టు హెడ్ రికార్డు:**

మొత్తం మ్యాచ్‌లు: 32
భారత్ విజయం: 26
శ్రీలంక విజయం: 5
ఫలితం లేనిది: 1

**కీలక ఆటగాళ్లు:**

భారత జట్టు తరఫున ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, కెప్టెన్ హర్మాన్‌ప్రీత్ కౌర్, ఆల్ రౌండర్ దీప్తి శర్మ మ్యాచ్ విన్నర్లుగా మారనుండగా.. శ్రీలంక జట్టు పూర్తిగా వారి స్టార్ కెప్టెన్ చమరి అతపత్తుపై ఆధారపడి ఉంది.

**మహిళల ఆసియా గేమ్స్ 2026 ఫైనల్ వివరాలు:**

తేదీ: సెప్టెంబర్ 22, 2026 (మంగళవారం)
సమయం: ఉదయం 10:30 గంటలకు (IST) (జపాన్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకు)
వేదిక: కోరోగీ స్పోర్ట్స్ పార్క్, నిషిన్, జపాన్
టీవీ ప్రసారం: భారత్‌లో Sony Sports Network ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది.
లైవ్ స్ట్రీమింగ్: SonyLIV యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ చూడవచ్చు.

# CSKలో సంచలన మార్పు.. జహీర్ ఖాన్‌కు హెడ్ కోచ్ బాధ్యతలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ కొత్త హెడ్ కోచ్‌గా భారత మాజీ దిగ్గజ పేసర్ జహీర్ ఖాన్ ను నియమించింది. గత 18 ఏళ్లుగా సీఎస్కేతో సుదీర్ఘ అనుబంధం ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ ఆ పదవి నుంచి తప్పుకోవడంతో జహీర్ ఖాన్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు.

**లెఫ్ట్ ఆర్మ్ టేకింగ్ ఓవర్.. సీఎస్కే గ్రాండ్ వెల్కమ్:**

ఇంగ్లాండ్ కోచ్‌గా ఫ్లెమింగ్: 18 ఏళ్ల పాటు సీఎస్కే కోచింగ్ సెటప్‌లో కీలక పాత్ర పోషించి ఎన్నో ట్రోఫీలను అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్, జులైలో ఇంగ్లాండ్ పురుషుల టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీఎస్కేతో తన బంధాన్ని ముగించడంతో ఫ్రాంచైజీ జహీర్‌ను ఎంచుకుంది. 2017లో ఐపీఎల్ నుంచి ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత జహీర్ ఖాన్ వివిధ ఫ్రాంచైజీలలో కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.

**మెంటార్‌గా జహీర్ అనుభవం:**

ముంబై ఇండియన్స్ : ముంబై ఇండియన్స్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ గా, ఆ తర్వాత హెడ్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌గా సేవలందించాడు.

లక్నో సూపర్ జెయింట్స్ : ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా వ్యవహరించాడు.

ఐపీఎల్ కెరీర్: ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB), ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడిన జహీర్ 27.27 సగటుతో 102 వికెట్లు పడగొట్టాడు.

అంతర్జాతీయ రికార్డు: టీమిండియా తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి ఏకంగా 610 అంతర్జాతీయ వికెట్లు సాధించాడు.

ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్, 2027 సీజన్ కోసం జహీర్ ఖాన్ మార్గదర్శకత్వంలో ఒక కొత్త శకానికి శ్రీకారం చుట్టింది. జహీర్ సుదీర్ఘ క్రికెటింగ్ విజన్ సీఎస్కే యువ బౌలర్లకు, జట్టు విజయాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## 700 గ్రాముల బరువుతో ఫైనల్ ఛాన్స్ మిస్: రింగ్‌లోనే ఏడ్చేసిన సుచిక.. కాంస్యంతో సరి!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 లో భారత మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ సుచిక తరియాల్ ( చారిత్రాత్మక విజయం సాధించినప్పటికీ, తీవ్ర గుండెకోతకు గురైంది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల సెమీఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసినా, విచిత్రమైన వెయిట్ రూల్ కారణంగా ఆమె రజతం/పసిడి పోరుకు దూరమై కాంస్య పతకంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితంతో తీవ్ర నిరాశ చెందిన సుచిక మ్యాచ్ ముగియగానే మ్యాట్‌పైనే ఒక్కసారిగా ఏడ్చేసింది.

**1000 డాలర్లు చెల్లించి ఛాలెంజ్ చేసినా:**

సింగపూర్‌కు చెందిన హ్యూ హూన్ టియో తో జరిగిన ఈ సెమీఫైనల్ పోరు అత్యంత ఉత్కంఠభరితంగా కొనసాగింది.

రెగ్యులర్ రౌండ్లు టై: ఇద్దరు ఫైటర్లు చెరో రౌండ్‌లో ఆధిపత్యం చెలాయించడంతో ఓవర్ టైమ్‌కు మ్యాచ్ వెళ్లింది. ఓవర్ టైమ్ తర్వాత కూడా విజేత ఎవరో స్పష్టంగా తేలకపోవడంతో తొలిగా టియోను విజేతగా ప్రకటించారు.

భారత్ రివ్యూ ఛాలెంజ్: రెఫరీ నిర్ణయాన్ని నిరసిస్తూ భారత మేనేజ్‌మెంట్ వి1,000 డాలర్లు (సుమారు ?84,000) ఆర్బిట్రేషన్ ఫీజు చెల్లించి సవాలు చేసింది. ఆరుగురు న్యాయనిర్ణేతలు రీ-రివ్యూ చేసి మ్యాచ్‌ను డ్రా (Draw)గా ప్రకటించారు.

**విజేతను తేల్చిన 700 గ్రాముల బరువు:**

ఇంటర్నేషనల్ మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం మ్యాచ్ రీ-రివ్యూ తర్వాత కూడా టై అయితే ఉదయం జరిగిన వెయిట్-ఇన్ ఆధారంగా తక్కువ బరువు ఉన్న ఫైటర్‌ను విజేతగా ప్రకటిస్తారు.

తక్కువ బరువుతో టియోకు లబ్ధి: సుచిక ఉదయం 59.2 కేజీల బరువు ఉండగా, సింగపూర్ ప్లేయర్ టియో 58.5 కేజీల బరువు ఉంది.

700 గ్రాముల తేడాతో: కేవలం 700 గ్రాములు తక్కువ బరువు ఉన్నందున టియోను విజేతగా ప్రకటించి ఫైనల్‌కు పంపారు. దీంతో సుచిక కాంస్య పతకానికి పరిమితమైంది.

**ఇది అన్యాయం.. కానీ దేశం కోసం గర్వపడుతున్నా:**

తీర్పు వినగానే తీవ్ర భావోద్వేగానికి గురైన సుచిక, నేను ఈ మ్యాచ్ గెలిచానని భావించాను.. ఫలితాన్ని అంగీకరించలేకపోతున్నాను, ఇది నాకు అన్యాయంగా అనిపించింది. కానీ దేశం కోసం కాంస్యం సాధించినందుకు సంతోషంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లా కిలోయ్ గ్రామానికి చెందిన సుచిక, చిన్నతనంలో రోడ్డుపై వేధింపులను ఎదుర్కొని స్వీయ రక్షణ కోసం కాంబ్యాట్ స్పోర్ట్స్‌లోకి వచ్చి నేడు ఆసియా గేమ్స్ పీఠం ఎక్కింది.

**చరిత్ర సృష్టించిన సుచిక:**

ఓటమి బాధ పక్కనబెడితే, ఆసియా గేమ్స్ చరిత్రలో మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ (వీహూ) విభాగంలో భారత్‌కు తొలి పతకం అందించిన అథ్లెట్‌గా సుచిక తరియాల్ చరిత్ర పుటలకెక్కింది. సుచిక సాధించిన ఈ కాంస్యంతో ఆసియా గేమ్స్ 2026లో భారత పతకాల సంఖ్య 6కు (4 వెండి, 2 కాంస్యం) చేరింది.

# దసరాకు వస్తే హిట్టే.. మరి ఈసారి?

టాలీవుడ్ లో కొంతమంది హీరోలకు కొన్ని సీజన్లతో స్పెషల్ రిలేషన్ ఉంటుంది. సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ కు సంక్రాంతి అలాంటి సీజన్ అయితే.. దసరా కూడా కలిసొచ్చిన సందర్భాలు ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల సినీ జర్నీలో ఆయన దసరా సమయంలో చాలా తక్కువ సినిమాలతోనే ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కానీ వచ్చిన ప్రతిసారీ బాక్సాఫీస్ దగ్గర తన మార్క్ చూపించారు. ఇప్పుడు మరోసారి దసరా సీజన్ లో వెంకీ సినిమా రాబోతుండటంతో ఆ సెంటిమెంట్ పై చర్చ మొదలైంది.వెంకటేష్ ఇప్పటివరకు దసరా సీజన్ ను టార్గెట్ చేస్తూ నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. వాటిలో ఎక్కువ సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో దసరా సీజన్ కూడా వెంకీకి కలిసొచ్చే టైమ్ గా మారింది. 2000లో వచ్చిన జయం మనదేరా అందుకు బెస్ట్ ఎగ్జాంపుల్. అక్టోబర్ లో దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సినిమా భారీ విజయాన్ని అందుకుంది.వెంకటేష్ కెరీర్ లో గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఎమోషన్ తో సాగిన ఆ సినిమా అప్పట్లో ప్రేక్షకులను థియేటర్లకు బాగానే రప్పించింది. ఆ తర్వాత 2007లో తులసితో మరోసారి దసరా బరిలోకి దిగారు వెంకటేష్. బోయపాటి శ్రీను







దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా యాక్షన్ తో పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చే అంశాలతో వచ్చింది. దసరా సెలవులను క్యాష్ చేసుకున్న ఆ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. 2008లో చింతకాయల రవితో మరోసారి ఇదే సీజన్ లో సందడి చేశారు.ఆ సినిమా గత రెండు చిత్రాల రేంజ్ లో విజయం సాధించకపోయినా.. ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. ఇలా దసరా సీజన్‌లో వెంకటేష్ కు వచ్చిన సినిమాలను చూస్తే.. ఎక్కువ సందర్భాల్లో మంచి రిజల్ట్సే కనిపిస్తాయి. అందుకే ఇప్పుడు రాబోతున్న కొత్త సినిమాపై కూడా ఆ సెంటిమెంట్ చర్చగా మారింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ నటిస్తున్న ఆదర్శ కుటుంబం ఈసారి దసరా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. కుటుంబ కథతో పాటు యాక్షన్, కామెడీ ఎలిమెంట్స్ తో తెరకెక్కుతోంది.ముందు అక్టోబర్ 2న విడుదల చేయాలనే ఆలోచన ఉండగా.. దసరా సెలవులను యూజ్ చేసుకునేలా పండుగ వారంలో విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వచ్చిన టీజర్ సినిమాపై హైప్ పెంచింది. త్రివిక్రమ్ డైలాగ్స్, వెంకటేష్ యాక్టింగ్ కలిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. పైగా దసరా సీజన్ వెంకీకి గతంలో మంచి రిజల్ట్స్ ఇచ్చిన సందర్భాలు ఉండటంతో అంచనాలు మరింత పెరుగుతున్నాయి.అయితే గత రికార్డులు కొత్త సినిమాకు విజయాన్ని ఫిక్స్ చేయవని చెప్పాలి. ఈసారి కథ, కామెడీ, వెంకటేష్ యాక్టింగ్, త్రివిక్రమ్ టేకింగ్ తో పాటు దసరా సెలవులను సినిమా ఎంతవరకు యూజ్ చేసుకుంటుందనేదే మెయిన్. గతంలో దసరా సెంటిమెంట్ ను సక్సెస్ గా మార్చుకున్న వెంకీ.. ఈసారి ఆదర్శ కుటుంబంతో ఆ జోష్ ను కంటిన్యూ చేస్తారా అనేది వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com